మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 164 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

ఆదివారం 11 ఆగస్టు 2024





# గూగుల్ దిగ్గజంతో రేవంత్‌భేటి

- సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి
- పలు అంశాలపై అధికారులతో చర్చ
- సెంటర్ విస్తరణకు జోయిటిస్ కంపెనీ సుముఖం

హైదరాబాద్, (ప్రజా మంటలు): అమెరికాలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన కొనసాగుతోంది. కాలిఫోర్నియాలో గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సీఎం సందర్శించారు. ఆ సంస్థ ప్రతినిధులతో ఆయన చర్చలు జరిపారు. రాష్ట్ర అభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై రేవంత్‌రెడ్డి చర్చలు జరిపినట్లు సీఎం కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. గూగుల్ ప్రతినిధులు వారికి ఆహ్వానం పలికారు.సీఎం వెంట మంత్రి శ్రీధర్‌బాబు, ఐటీ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. ప్రపంచంలో ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థగా పేరొందిన జోయిటిస్ కంపెనీ హైదరాబాద్‌లోని కెపాబులిటీ సెంటర్ విస్తరించాలని నిర్ణయించింది. 2024 సెప్టెంబర్ నుంచి ఈ విస్తరణ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించింది. దీంతో వందలాది మందికి కొత్త ఉద్యోగాలు

## తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేస్తాం

- బయోడిజైన్ రంగంలో నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యం
- ప్రభుత్వంతో భాగస్వామ్యం.. శాటిలైట్ సెంటర్ పై ఆసక్తి
- ముఖ్యమంత్రి లేఖను అందించిన స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ బృందం

న్యూయార్క్ (ప్రజా మంటలు): అమెరికాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం పర్యటన కొనసాగుతోంది. కాలిఫోర్నియాలోని స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ, గూగుల్ ప్రధాన కార్యాలయం, జొయిటిస్ కంపెనీని సీఎం సందర్శించారు.విద్య, నైపుణ్యాభివృద్ధి, హెల్త్ కేర్ రంగాల్లో పరస్పర సహకారంపై మిగతా 2లో..

## వయనాడ్ విలయం కలిచివేసింది

- బాధితులకు అండ ఉంటాం
- క్షతగాత్రులకు ప్రధాని ప్రధాని మోడీ పరామర్శ
- దెబ్బతిన్న ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- సీఎం పినరయ్‌తో కలసి సమీక్ష
- అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ



తిరువనంతపురం (ప్రజా మంటలు): కేరళలో ప్రకృతి ప్రకోపానికి బలైన వయనాడ్ బాధితులకు అండగా ఉంటామని ప్రధాని మోడీ ప్రకటించారు. వారికి తగి సహాయం అందిస్తామని అన్నారు. వయనాడ్ విలయ ప్రాంతంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించారు. భారీ వర్షాలు, వరదలతో కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధితులు, ప్రాణాలతో బయటపడిన వారిని మోదీ పరామర్శించారు. అనంతరం కేరళ సీఎం పినరయి విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, కేంద్రమంత్రి సురేష్ గోపి, ఇతర యవనాడ్ ఉన్నతాఅధికారులతో ప్రధాని సమిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. వయనాడ్‌లో కొండచరియలు విగిరిపడినప్పటి నుంచి ఘటనకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఈ విపత్తులో వందలమంది తమ సర్వస్వాన్ని కోల్పోయారని అన్నారు. ప్రకృతి విలయంలో వాళ్ల కలలన్నీ కల్లలైపోయాయని అన్నారు. ఈ దుఃఖ సమయంలో మీకు అండగా ఉంటామని బాధితులకు చెప్పినట్లు తెలిపారు. 'ఈ రోజు నేను రిలీఫ్ క్యాంపులో బాధితులను స్వయంగా కలిశాను. గాయపడిన వారిని ఆసుపత్రిలో పరామర్శించాను. వారు చాలా కష్ట పరిస్థితిలో మిగతా 2లో..

## జమ్మూకశ్మీర్ మిలిటెంట్ల కాల్పులు..

- ఇద్దరు జవాన్లు మృతి
- ముగ్గురికి గాయాలు

శ్రీనగర్ (ప్రజా మంటలు): జమ్మూకశ్మీర్ అనంత్‌నగర్ జిల్లాలో ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు జవాన్లు వీరమరణం పొందారు. సైనికుడితో పాటు మరో మిగతా 2లో..






# అర్హులందరికీ రేషన్ కార్డులు

- గ్రామీణప్రాంతాల్లో వార్షికాదాయం రూ.లక్షన్నర, మాగాణి 3.50 ఎకరాలు, చెలక 7.5 ఎకరాలు ప్రామాణికం
- పట్టణప్రాంతాల్లో రూ. 2లక్షలుగా నిర్ధారణ
- సక్సేనా కమిటీ సిఫారసుల మేరకే అర్హత ప్రమాణాలు
- ప్రజాప్రతినిధుల అభిప్రాయాలూ పరిగణలోకి..
- మంత్రివర్గ ఉపసంఘం భేటిలో నిర్ణయం
- విధివిధానాలపై కసరత్తు
- వివరాలు వెల్లడించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, (ప్రజా మంటలు): ఏళ్లుగా తెల్ల రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రేషన్ కార్డుల జారీ పక్రియను వేగవంతం చేసింది. అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా ఇదే అంశంపై రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ భేటీ అయ్యింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఇతర మంత్రులు, సంబంధిత శాఖా అధికారులు హాజరయ్యారు. రేషన్ కార్డుల జారీపై మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం నాడు కొత్త రేషన్ కార్డుల మంజూరీపై మిగతా 2లో..

## ప్రజా నాడి




# మూడో విడత రుణమాఫీకి సర్కారు సిద్ధం

- రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులు నిండాయి
- అన్నింటా జల విద్యుత్ ఉత్పత్తిని పెంచండి
- అధికారులతో డిప్యూటి సిఎం భట్టి సమీక్ష

హైదరాబాద్, (ప్రజా మంటలు): త్వరలో మూడో విడత రుణమాఫీకి సర్కారు సిద్ధమవుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. కాగా జల విద్యుత్ కేంద్రాల్లో గరిష్ఠ విద్యుత్ ఉత్పత్తికి చీఫ్ ఇంజినీర్లు చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాలతోపాటు పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నందున వీలైనంత ఎక్కువ ఉత్పత్తిపై థర్మల్, హైడల్ ప్రాజెక్టుల సీఈలు దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన థర్మల్, హైడల్ విద్యుత్ ఉత్పాదకతకు సంబంధించి మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఆ శాఖల సీఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. థర్మల్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిప్లాంట్‌లో కనీసం 17రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు నిబద్ధతతో పని చేయాలని స్పష్టం చేశారు. పనిలో నిర్లక్ష్యం, అలసత్వాకి తావు లేదని హెచ్చరించారు. విద్యుత్ శాఖ అంటేనే ప్రజల కోసం నిరంతరం పనిచేసే శాఖ అని చెప్పుకొచ్చారు. 24/7 పని చేయాల్సిన అత్యవసర శాఖ అనే విషయాన్ని అధికారులు, సిబ్బంది గుర్తుపెట్టుకోవాలని హితవుపలికారు. విద్యుత్ ఉత్పత్తిలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని భట్టి విక్రమార్క అధికారులకు చెప్పారు. సకాలంలో నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే గతంలో శ్రీశైలం, జూరాల వంటి హైడల్ విద్యుత్ ప్రాజెక్టుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, తద్వారా ఏర్పడిన నష్టం గురించి అధికారులకు వివరించారు. ఇకపై నిర్ణయాలు తీసుకోవడంలో అలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదని చెప్పారు. ఇందుకుగాను వారానికి ఒకసారి విద్యుత్ కేంద్రాల పరిస్థితి, ఉత్పాదకతకు సంబంధించిన నివేదికలు తనకు



పంపాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ శాఖలో పని చేసే ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వినేందుకు, పరిష్కరించేందుకు తాను 24గంటలూ అందుబాటులో ఉంటానని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. ఒకవేళ తాను అందుబాటులో లేకుంటే సమస్యలను విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రాజెక్టులకు సంబంధించి సీఈలు నిర్లక్ష్యం వహించినట్లుగా ఉంటే రాతపూర్వకంగా వారి నుంచి వివరణ తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఉన్నతాధికారు లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్ కో జేఎమ్డీ శ్రీనివాస్, ఎనర్జీ ఓఎస్డీ సురేందర్ రెడ్డి, జెన్కో డైరెక్టర్లు, సీఈలు హాజరయ్యారు.

మొదటి పేజీ తరువాయి

# గూగుల్ దిగ్గజంతో రేవంత్‌భేటి

లభించనున్నాయి. హైదరాబాద్‌లో జోయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్‌ను విస్తరించనున్నట్లు ప్రకటించింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు అధికారుల బృందంతో కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తమ జోయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్‌ను విస్తరించే నిర్ణయాన్ని స్వాగతించారు. తెలంగాణలో కొత్త ఆవిష్కరణలకు, వ్యాపార వృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని అన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దాలనే తమ ఆలోచనలకు ఈ పెట్టుబడులు దోహదపడుతాయన్నారు. వందలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలో జోయిటిస్ రంగ ప్రవేశం హైదరాబాద్‌కు మరింత గుర్తింపు తెస్తుందని సీఎం అన్నారు. ఇండియాలో తమ కంపెనీ విస్తరణకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని, తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావటం సంతోషంగా ఉందని జోయిటిస్ కంపెనీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సర్‌బాగ్ అన్నారు. తమ కంపెనీ విస్తరణ జంతు ఆరోగ్యానికి సంబంధించి సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు ఉపయోగపడుతుందన్నారు. హైదరాబారద్‌లో అందుబాటులో ఉన్న ప్రపంచ స్థాయి ప్రతిభా వనరులను సద్వినియోగం చేసుకుంటామని జోయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రాఘవ్ అన్నారు. ప్రపంచంతో పోటీ పడే సేవలందించటంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకుంటామన్నారు. జోయిటిస్ కంపెనీ విస్తరణ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వనరులు, తమ ప్రభుత్వ విధానాలపై ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబించిందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాబోయే సంవత్సరాల్లో కొత్త ఉద్యోగాలతో పాటు జంతు ఆరోగ్య సంరక్షణలో మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కంపెనీ విస్తరణకు ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందన్నారు. జోయిటిస్ కంపెనీ దాదాపు 70 సంవత్సరాలుగా జంతువుల అనారోగ్యం, రోగ నిర్ధారణ, నిరోధించే మార్గాలు, చికిత్స సంబంధిత అంశాలపై పని చేస్తోంది. జంతు సంరక్షణలో భాగంగా పశు వైద్యులు, పెంపుడు జంతువుల యజమానులు, రైతులకు అండగా నిలుస్తోంది. ఔషధాలతో పాటు వ్యాక్సిన్‌లు, రోగ నిర్ధారణలో కొత్త సాంకేతికత, ఆవిష్కరణలపై దాదాపు వంద దేశాలకు సేవలు అందిస్తోంది.

## తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేస్తాం

స్టాన్ ఫోర్డ్ సెంటర్ ఫర్ బయోడిజైన్ సీనియర్ ప్రతినిధులతో రేవంత్ రెడ్డి బృందం చర్చించింది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ముందుకొచ్చింది. హెల్త్ కేర్ రంగంలో భాగస్వామ్యం, కొత్తగా ఏర్పాటు చేయనున్న లైఫ్ సైన్సెస్, స్కిల్ యూనివర్సిటీలకు మద్దతుతో పాటు.. రాష్ట్రంలో కేంద్రం ఏర్పాటు చేయాలని స్టాన్ ఫోర్డ్ బయోడిజైన్ అధికారులను రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు.అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై గూగుల్ ప్రతినిధులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో తమ కెపాబులిటీ సెంటర్‌ను సెప్టెంబరులో విస్తరించనున్నట్టు జంతు ఆరోగ్య సంస్థ జొయిటిస్ ప్రకటించింది. కొత్త ఆవిష్కరణల అభివృద్ధితో తెలంగాణ దేశంలో ముందు వరుసలో ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న లైఫ్ సైన్సెస్, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులు.. ప్రభుత్వానికి లేఖ సమర్పించారు. వైద్య పరికరాల పరిశ్రమ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న చొరవ.. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని స్టాన్ ఫోర్డ్ ప్రతినిధులు అనురాగ్ మైరాల్, జోష్ మేకొవర్ పేర్కొన్నారు. కొత్త సంస్కరణలతో తెలంగాణ భారత్‌లో ముందు వరుసలో ఉందని సీఎం రేవంత్ రెడ్డి వారికి వివరించారు.స్టాన్ ఫోర్డ్ వంటి గ్లోబల్ లీడర్ల భాగస్వామ్యంతో హెల్త్ కేర్ రంగంలో అవసరమైన ఆధునిక నైపుణ్యం, పరిజ్ఞానాన్ని తెలంగాణ యువత అందించాలనే లక్ష్యంతో ఉన్నట్లు సీఎం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, స్టాన్ ఫోర్డ్ భాగస్వామ్యం వల్ల ప్రపంచవ్యాప్తంగా హెల్త్ కేర్ రంగానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెలంగాణలో స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ శాటిలైట్ సెంటర్ ఏర్పాటును పరిశీలించాలని కోరారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎస్, వివిధ శాఖల ఉన్నతాధికారులు కూడా చర్చల్లో పాల్గొన్నారు.

### జమ్మూకశ్మీర్ మిలిటెంట్ల కాల్పులు..

ఇద్దరు పౌరులు గాయపడ్డారు. దక్షిణ కశ్మీర్ జిల్లాలోని కోకెర్‌నాగ్‌లోని అహ్లాన్ గగుర్మండు ప్రాంతంలో ఉగ్రవాదులు సంచారిస్తున్నారన్న సమాచారం మేరకు భద్రతా బలగాలు అక్కడికి చేరుకొని చేరుకొని కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో నక్కిన ఉగ్రవాదులు తనిఖీలు చేస్తున్న భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. అటవీ ప్రాంతంలో ఇద్దరు ఉగ్రవాదులు ఉన్నారని.. వారిని సైనం చుట్టుముట్టినట్లు తెలుస్తున్నది.ప్రస్తుతం సంఘటనా స్థలంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు కొనసాగుతున్నట్లుగా ఆర్మీ అధికారులు తెలిపారు. ఇంతకు ముందు 6న బసంత్‌గఢ్ ప్రాంతంలో సాయంత్రం 4 గంటలకు భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. రెండు గంటలపాటు ఇరువైపులా కాల్పులు జరిగాయి. ప్రతికూల వాతావరణం, పొగమంచు మధ్య సాయంత్రం వరకు భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి.

# వయనాడ్ విలయం కలిచివేసింది



ఉన్నారు. వయనాడ్ విలయంలో చిక్కకున్న వారికి అండగా నిలవాలి. అంతా కలిసి పనిచేస్తేనే బాధితులకు అ అండ దక్కగలదు. ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు అంతా కలిసి పనిచేయాలి. ఆప్తులను కోల్పోయిన వారికి అండగా నిలుద్దాం. రాష్ట్ర ప్రభుత్వం నష్టం అంచనాలు పంపిన వెంటనే ప్రకృతి విపత్తు సాయం అందిస్తాం అన్నారు. సంఘటన జరిగిన రోజు ఉదయం నేను సిఎం పినరయి విజయన్‌తో మాట్లాడాను. మేము సహాయం అందజేస్తామని, వీలైనంత త్వరగా సంఘటనా స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చాను. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్. సైన్యం, పోలీసులు, వైద్యులు, ప్రతి ఒక్కరూ బాధితులకు వీలైనంత త్వరగా సహాయం చేయడానికి ప్రయత్నించారు. మృతుల కుటుంబీకులు ఒంటరిగా లేరని నేను హామీ ఇస్తున్నాను. వారికి మేము అండగా ఉన్నాం. కేరళ ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం వారికి సాయం చేస్తోందని తెలిపారు. వయనాడ్ కొండచరియల ప్రకృతి విపత్తును ప్రధాని మోదీ శనివారం హెలికాప్టర్ ద్వారా వీక్షించారు. ఢిల్లీ నుంచి విమానంలో కేరళకు బయలుదేరిన ప్రధాని.. ఉదయం 11 గంటలకు కన్నూర్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్నారు. ఆయన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ రిసీవ్ చేసుకున్నారు. అక్కడ నుంచి ఓ ప్రత్యేక విమానంలో వయనాడ్ బయలుదేరారు. కొండచరియలు సంభవించిన చూరల్ మలా, మండక్కై ప్రాంతాలలో ఏరియల్ సర్వే నిర్వహించారు. రెస్క్యూ ఆపరేషన్, సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల గురించి అధికారులను ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులను కలుసుకోని మాట్లాడారు. వయనాడ్ ప్రాంతంలో ప్రకృతి విళయ తాండవం వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించారు. అధికారులతో కేంద్ర సహాయం గురించి చర్చించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను కలుసుకున్నారు. తర్వాత ప్రాణాలతో బయటపడిన వారిని కలిసి కొండచరియల విధ్వంసం గురించి తెలుసుకోనున్నారు. ఆయనతోపాటు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, ప్రభుత్వ అధికారులు ఉన్నారు.

# రేషన్ కార్డుకు మార్గదర్శకాలు జారీ

సచివాలయంలో జరిగిన మంత్రివర్గ ఉపసంఘం భేటీకి చైర్మన్‌గా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యవహరించారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహ హాజరయ్యారు.తెల్లరేషన్ కార్డుల పంపిణీకి విధివిధానాలపై మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కూడిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై చర్చించింది. రాష్ట్రంలో అర్హులైన ప్రజలందరికీ తెల్ల రేషన్ కార్డు జారీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వార్షిక ఆదాయం లక్షన్నర, మాగాణి 3.50 ఎకరాలు, చెలక 7.5 ఎకరాలు ప్రామాణికంగా తెల్ల రేషన్ కార్డు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రెండు లక్షలుగా నిర్ణయించారు. పట్టణ ప్రాంతాల్లో భూములను కాకుండా వార్షిక ఆదాయాన్ని ఆధారంగా రేషన్ కార్డు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుల పంపిణీలో లబ్దిదారుల ఎంపికకు విధి విధానాల రూపకల్పనలో రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయనున్నట్లు మంత్రివర్గ ఉపసంఘం తెలిపింది. లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ, శాసనమండలి సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. వాందరికీ సమాచారం చేరేలా లేఖలు రాయాలని అధికారులను ఆదేశించింది మంత్రివర్గ ఉపసంఘం. తెల్ల రేషన్ కార్డుల జారీ కోసం సక్సేనా కమిటీ సిఫారసుల పరిశీలించడం, దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో తెల్ల రేషన్ కార్డుల అర్హత ప్రమాణాలను పరిశీలించాలను అధికారులను మంత్రులు ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో తెల్ల రేషన్ కార్డు ఉండి తెలంగాణలోనూ వైట్ రేషన్ కార్డు ఉంటే తీసివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్ష వార్షిక ఆదాయం లేదా మాగాణి 3.50 ఎకరాలు, లేదా చెలక 7.5 ఎకరాల లోపు భూమి ఉన్నవారినే ఎంపిక చేయాలని ప్రతిపాదించారు. పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల గరిష్ట వార్షికాదాయం ఉన్న వారినే అర్హులుగా నిర్ణయించాలని సూచించారు. అన్ని పార్టీలు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకోవాలని ఉపసంఘం నిర్ణయించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేఖలు రాసి సూచనలు తీసుకోవాలని నిర్ణయించింది. రెండు రాష్టాల్లో రేషన్ కార్డులున్న వారికి ఆప్షన్ ఇవ్వాలని ప్రతిపాదించింది. సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సక్సేనా కమిటీ సిఫారసులను రేషన్ కార్డుల మంజూరుకు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రస్తుతం 89.96 లక్షల రేషన్ కార్డులుండగా.. పెండింగులో 10 లక్షల దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రప్రభుత్వాలను ఆదేశించండి

- ప్రధాని మోదీ చొరవ చూపాలి
- అమలుకు అన్ని రాష్ట్రాలూ త్వరగా ముందుకురావాలి
- ఇప్పటికే నాలుగు రాష్ట్రాల సీఎంలు ముందుకొచ్చారు
- రిజర్వేషన్లు అన్ని కుటుంబాలకు అందుబాటులోకి రావాలి
- ఢిల్లీలో మీడియా సమావేశంలో మందకృష్ణ మాదిగ



న్యూఢిల్లీ (ప్రజా మంటలు): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ రిజర్వేషన్ల వర్గీకరణపై ప్రధాని మోదీ నిర్దిష్టంగా హామీ ఇచ్చారని చెప్పారు. దిల్లీలో మందకృష్ణ మిడియాతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాకారంలో మోదీ, అమిత్‌షా పాత్ర ఎంతో ఉంది. ప్రధాని, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలి. వర్గీకరణ డిమాండ్ ఉన్న ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలి. వెంటనే అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించాలని మోదీకి విజ్ఞప్తి చేశా. సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ప్రతి జడ్జికీ పేరుపేరునా ధన్యవాదాలు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 ఏళ్లు దాటినా రిజర్వేషన్ల ఫలాలు చాలా కుటుంబాలకు అందలేదు. వర్గీకరణకు మద్దతుగా నిలిచిన ప్రతి నాయకుడికీ కృతజ్ఞతలు చెబుతున్నా. ఎస్సీ వర్గీకరణను దక్షిణాదిలో నలుగురు సీఎంలు వెంటనే స్వాగతించారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఏపీ సీఎం చంద్రబాబు ముందుగానే స్పందించి స్వాగతిస్తున్నట్లు చెప్పారని మందకృష్ణ మాదిగ అన్నారు. గతంలో నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ అమలు చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం జరిగిన టీడీపీ పోలిట్‌బ్యూరో సమావేశంలో కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని సంతోషం వ్యక్తం చేశారు. ఆయనను కలిసి ధన్యవాదాలు తెలుపుతామన్నారు. విదేశీ పర్యటన నుంచి రాగానే సీఎం రేవంత్ రెడ్డిని కూడా కలిసి ధన్యవాదాలు చెబుతామని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. కాగా మందకృష్ణ మాదిగ శుక్రవారం రాత్రి ఢిల్లీలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వారిని కలిసారు. . దాదాపు 30 నిమిషాలపాటు ప్రధానితో భేటీ అయిన మందకృష్ణ ఎస్సీ వర్గీకరణకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మంద కృష్ణను ఆప్యాయంగా పలకరించి హత్తుకున్న ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ. తెలుగు రాష్టాల్లో వర్గీకరణ త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని కోరారు. వర్గీకరణ అంశంపై కొందరు సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్న నేపథ్యంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుగ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది.

# తెలంగాణలో టీడీపీని బలోపేతానికి చేస్తాం

- త్వరలోనే పార్టీకి కొత్త అధ్యక్షుడి నియామకం
- ఏపీ సీఎం చంద్రబాబు



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలుగు ప్రజల కోసం పుట్టిందే తెలుగుదేశం పార్టీ అని, తెలంగానలోనూ పార్టీ బలోపేతం కావాల్సి ఉందని టిడిపి అధినేత, ఎపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో ముఖ్య నేతలతో చంద్రబాబు నాయుడు సమావేశం అయ్యారు. తెలంగాణాలో పార్టీ పునర్నిర్మాణం పై చర్చ జరిగింది., ప్రస్తుతం ఉన్న పార్టీ పదవులు అన్ని రద్దు చేసినట్లు.., రాష్ట్ర నూతన అధ్యక్ష ఎన్నికకు త్వరలో నిర్ణయం తీసుకోబోతున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ స్థాయిలో సభ్యత్వాల నమోదు కార్యక్రమం చేపట్టాలని చంద్రబాబు సూశించారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తెచ్చేలా పని చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అందరినీ చూడడానికి ఇక్కడికి వచ్చాను. ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క సారే వచ్చాను. మరోసారి ఇక్కడ అందరినీ కలిసి రెండు గంటలు గడుపుదామని వచ్చాను. ఇక్కడ వచ్చిన తరువాత నాకు ఇచ్చిన ప్రతి అప్లికేషన్ తీసుకున్నాను. ఇక్కడ పార్టీ నీ మరోసారి బలోపేతం చేయాలని అందరూ కోరుకుంటున్నారు.. ఇక్కడ పార్టీలో పని చేయడానికి చాలా మంది సిద్ధంగా ఉన్నారు.. వారందరి కోసం పార్టీ బలపర్చాలని అనుకుంటున్నాము.. పార్టీ ఎలా బలపర్చాలనేది ఆలోచన చేస్తున్నాము.. కొన్ని ప్రత్యేకమైన పరిస్థితిలో ఇక్కడ అధ్యక్షున్ని పెట్టలేదు.. ఇక్కడ గత రెండు ఎన్నికలకి దూరంగా ఉన్నాము.. ఊహా జనిత ప్రశ్నలకు సమాధానం చెప్పాను..పార్టీ ని ఎలా బలోపేతం చేయాలని, ప్రజలకు ఎలా సేవలు అందించాలి అనేది ఆలోచిస్తునాం.. తెలుగు ప్రజల కోసం నిరంతరం పని చేసిన పార్టీ టీడీపీ. ఆంధ్రప్రదేశ్ లో వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దానిని దారిలోకి తెచ్చుకోవాలి. తెలంగాణలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను. తెలుగు ప్రజల మనోభావాల కోసం పని చేస్తాము. ఇప్పుడు ఏపీలో ఆలయాలపై దాడులు జరగడం లేదు. గత ప్రభుత్వంలో ఆలయాలపై దాడి చేసిన వారిని పై చర్యలు తీసుకుంటాం. తెలంగాణలో తెలుగు జాతి ఎదగాలి. విజన్ 2047 కోసం పనిచేస్తాం. 2047 వరకు ప్రపంచంలో ఉన్న తెలుగు వారు ఉన్నత స్థాయిలో ఉండేలా చేయడం నా లక్ష్యం. ఆ రోజు 2024 అని మాట్లాడితే నన్ను 420 అన్నారు. సెల్ ఫోన్ గురుంచి మాట్లాడితే నన్ను హేళన చేశారు. రానున్న రోజుల్లో తెలుగు రాష్టాలు టెక్నాలజీలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతాయని ఆయన అన్నారు. అరవింద్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లాలో మరోసారి చెలరేగిన అల్లర్లు

- సుప్రీం జడ్జిలు దిగిపోవాలని నిరసనలు
- రాజీనామా చేసిన సీజేఐ



ఢాకా (ప్రజా మంటలు): బంగ్లాదేశ్‌లో మరోసారి అల్లర్లు చెలరేగాయి. ఈసారి నిరసనకారులు సుప్రీంకోర్టును లక్ష్యంగా చేసుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇతర న్యాయమూర్తులు దిగిపోవాలంటూ కోర్టు వద్ద నిరసనలు చేశారు. దాంతో ఆయన దిగొచ్చారు. తాను రాజీనామా చేస్తానని వెల్లడించారు. బంగ్లా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి.. ఇతర న్యాయమూర్తులతో సమావేశానికి పిలుపునిచ్చారు. అయితే దీనికి తాత్కాలిక ప్రభుత్వం అనుమతి లేదని, అలాగే ఆయన దేశం విడిచి పారిపోవచ్చనే వార్తలతో ఈ నిరసనలు ఒక్కసారిగా చెలరేగాయి. విద్యార్థులతో పాటు పలువురు నిరసనకారులు సుప్రీంకోర్టు వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. దీంతో న్యాయమూర్తుల సమావేశం అర్ధంతరంగా ఆగిపోయింది. అక్కడితో శాంతించని ఆందోళనకారులు కోర్టును చుట్టుముట్టారు. చీఫ్ జస్టిస్ గంటలో దిగిపోవాలంటూ డిమాండ్లు చేయగా.. ఆయన అందుకు అంగీకరించాల్సి వచ్చింది. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్ హసీనా ఇటీవల వైదొలిగిన విషయం తెలిసిందే. ఆమె ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు దేశాధ్యక్షుడు పార్లమెంటును రద్దు చేశారు. తాత్కాలిక పరిపాలన యంత్రాంగానికి యూనస్‌ను సారథిగా నియమితులయ్యారు. జులై నుంచి దశలవారీగా జరుగుతోన్న ఆందోళనల్లో 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వీటిన వెనక విదేశీ హస్తం ఉందంటూ కథనాలు వెలువడ్డాయి. మరో రెండు నెలల్లో మహిళల టీ20 ప్రపంచకప్ జరగనుంది. అందుకు వేదిక బంగ్లాదేశ్. ఇప్పుడు అక్కడ అల్లర్లు కొనసాగుతూనే ఉండటంపై క్రికెట్ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ప్లేయర్ల భద్రతపై తమకు హామీ ఇవ్వాలని ఆ దేశ ఆర్మీ చీఫ్‌కు బంగ్లా క్రికెట్ బోర్డు విజ్ఞప్తి చేసింది. ఆర్మీ చీఫ్ వాకెర్ ఉజ్ జమాన్‌కు బీసీబీ లేఖ రాసినట్లు కథనాలు వచ్చాయి. అక్టోబరు 3వ తేదీ నుంచి 20 వరకు పొట్టి కప్ జరగనుంది. సెప్టెంబర్ చివరివారంలో వార్మప్ మ్యాచ్‌ల సందడి మొదలుకానుంది. బంగ్లాదేశ్‌లో పరిస్థితులపై ఐసీసీ కూడా నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఒకవేళ అక్కడ వీలుకాకపోతే.. భారత్‌తోపాటు యూఏఈ, శ్రీలంకను ఇతర ఛాయిస్‌గా ఐసీసీ భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

# భారత్-మాల్దీవుల మధ్య సంబంధాలు బలోపేతం చేస్తాం

- మాల్దీవుల పర్యటనలో విదేశాంగ మంత్రి జైశంకర్
- అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో భేటీ



న్యూఢిల్లీ (ప్రజా మంటలు): మాల్దీవుల పర్యటనలో ఉన్న భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్.. ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ అనేక అంశాలపై చర్చలు జరిపారు. మూడు రోజులపర్యటనలో భాగంగా ఆగస్టు 11వరకు అక్కడే ఉండనున్న ఆయన.. ఇరు దేశాల ద్వైపాక్షిక అంశాలపై చర్చించనున్నారు. చివరిసారిగా 2023 జనవరిలో జైశంకర్ అక్కడ పర్యటించిన విషయం తెలిసిందే.భేటీకి సంబంధించి 'ఎక్స్'లో స్పందించిన జైశంకర్.. అధ్యక్షుడు డాక్టర్ మొహమ్మద్ ముయిజ్జుతో భేటీ కావడం విశేషమన్న ఆయన.. భారత ప్రధాని మోదీ తరఫున శుభాకాంక్షలు తెలియజేసినట్లు వివరించారు. తమ ప్రజలు, ఈ ప్రాంత ప్రయోజనాల కోసం భారత్-మాల్దీవుల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయన్నారు. అనంతరం ముయిజ్జు మాట్లాడుతూ.. తమ మిత్రదేశాల్లో భారత్ ఎల్లప్పుడూ ఉంటుందని.. మాల్దీవులకు అవసరమైనప్పుడల్లా సహాయాన్ని అందిస్తుందని అన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు క్రీడల పోటీలు



జనగామ ఆగస్టు 10 (ప్రజామంటలు):

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు, పాత్రికేయులకు క్రీడల పోటీలు మండల, జిల్లా స్థాయిల లోనూ నిర్వహిస్తున్నందున అందరూ ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణం కల్పించాలన్నారు.

మండల స్థాయిలో గెలుపొందిన వారు జిల్లా స్థాయిలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఈనెల 12, 13వ తేదీలలో మండల స్థాయి ఉద్యోగులకు, పాత్రికేయులకు క్రీడలు నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వారు 14వ తేదీ ఉదయం 8 గంటలకు జనగాం లోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రీడలలో పాల్గొనవచ్చునన్నారు. మహిళలకు టగ్గాఫ్ వార్, లెమన్ మరియు స్పూన్, మ్యూజికల్ చైర్, 100 మీటర్ల స్పీడ్ వాకింగ్, కబడ్డీ, చెస్ వంటివి నిర్వహించ నున్నామని, పురుషులకు క్రికెట్, వాలీబాల్, టగ్గాఫ్ వార్, లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు పందెంతో పాటు కబడ్డీ క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లా స్థాయిలోనూ 12వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట నుండి జిల్లా స్థాయి అధికారులకు, ఉద్యోగులకు, పాత్రికేయులకు క్రీడా పోటీలు ఉంటాయని మహిళలకు పైన పేర్కొన్న విధంగా క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని, పురుషులకు కూడా పైన పేర్కొన్న విధంగా క్రీడా పోటీలతోపాటు బ్యాడ్మింటన్ (డబుల్స్) క్రీడను అదనంగా చేర్చడం జరిగిందని గమనించాలన్నారు. 13వ తేదీ ఉదయం 10 గంటలకు మినీ స్టేడియంలో క్రికెట్ క్రీడా పోటీలకు ఐడిఓసి స్టాఫ్, జనగాం డివిజనల్ లెవెల్ స్టాఫ్, స్టేషన్ ఘన్పూర్ డివిజనల్ లెవెల్ స్టాఫ్, పోలీస్ శాఖ తో పాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ పాత్రికేయులు తమ పేర్లను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటరెడ్డి కి ఇవ్వవలసిందిగా సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీవోల ఆధ్వర్యంలోనూ, జిల్లా స్థాయిలో జిల్లా అధికారుల ఆధ్వర్యంలోనూ క్రీడలు నిర్వహించిన అనంతరం గెలుపొంది ప్రథమ స్థానం సాధించిన విజేతలకు ఆగస్టు 15వ తేదీన నిర్వహిస్తున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథులచే బహుమతుల ప్రధానోత్సవం ఉంటుందన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, పాత్రికేయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.




# ఉపాధ్యాయ ఉద్యమ దిక్సూచి యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సంబురాలు

జనగామ అగస్టు 10 (ప్రజామంటలు):

ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా "హక్కులు-బాధ్యతలు రెండు నేత్రాలుగా.. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా స్థాపించిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50 వసంతాలు పూర్తిచేసుకుని స్వర్ణోత్సవ సంబురాలు చేసుకోవడం గర్వకారణమని జనగామ జిల్లా టి ఎస్ యు టి ఎఫ్ అధ్యక్షులు చంద్రశేఖర్ రావు అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని కార్యాలయం ముందు సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా పతాకావిష్కరణ చేసిన అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా ఆయన మాట్లాడుతూ స్వర్ణోత్సవాలు జరుపుకోవడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస రావు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉద్యమ చరిత్రను ఉద్యమ నేపథ్యాన్ని ఉద్యమ పోరాటాలను సామాజికంగా చేసిన, చేస్తున్న సేవలను తెలియజేస్తూ యూటీఎఫ్ సంఘం గొప్ప చరిత్ర గల సంఘమని ఉపాధ్యాయుల కోసం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడే సంఘం అని సమస్యలను సాధించే సంఘం అని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కృష్ణ , వివిధ మండలాల బాధ్యులు శ్రీనివాస్, కృష్ణ మూర్తి, కనకయ్య, గోవర్ధన్ రెడ్డి, నాగరాజు, రవీందర్, మహేష్ , ఉప్పలయ్య, నవీన్, నర్సింహులు, వీర్యా నాయక్, నర్సింహులు, రాజమల్లు పాల్గొన్నారు.

# మెడికల్ విద్యలో ప్రవేశాలలో స్థానికత నిర్ణయించే జీ.వో.నెం: 33 వెనక్కి తీసుకోవాలి




జనగామ ఆగస్ట్ 10 (ప్రజామంటలు):

రాష్ట్రంలో మెడికల్ ప్రవేశాలకు (ఎంబిబిఎస్, బిడిఎస్)లో స్థానికత నిర్ణయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీ.వో. నెం 33 వల్ల తెలంగాణ విద్యార్థులు కూడా తమ స్థానికత కోల్పోయో అవకాశం ఉందని ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు దాసగానీ సుమ అన్నారు. జనగామ మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ... తెలంగాణ విద్యార్థులకు కూడా ఇతర రాష్ట్రాలో 9-12 తరగతులు చదివే అవకాశం ఉందని, ఈ జీ.వో.వల్లన తెలంగాణ విద్యార్థులు కూడా స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉందన్నారు. గతంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం 6-నుండి 12 వరకు 07 ఎండ్ల కాలంలో ఎదైనా 4 అకడమిక్ ఇయర్స్ చదివి ఉంటే స్థానికులు అని నిర్ణయించింది. ప్రస్తుతం ప్రభుత్వం 9-12 వరకు చదివి ఉంటే స్థానికులు అని చెబుతుంది. దీనివల్లన తెలంగాణ రాష్ట్రంలో స్థానికత అంశంలో ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడకు వచ్చిన వారు కూడా స్థానిక కోటా పోందుతారు.దీంతో స్థానికులు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. మెడికల్ విద్య ప్రవేశాలలో కూడా ఉద్యోగ నియామకాలు కోసం తీసుకుంటున్న స్థానికతనే (1 నుండి 07 తరగతి) పాఠశాల విద్యను ప్రమాణికంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ కోరుతుంది. ఈ సవరణలు చేసి జీ.వో. తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్యా మురళి శ్రీనాథ్ రాజేష్ పవన్ కళ్యాణి మేఘన తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన ముదిరాజ్ సంఘ నాయకులు



చిగురుమామిడి ఆగస్ట్ 10 (ప్రజామంటలు):

హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ముదిరాజుల సమగ్ర కుల సంఘ భవన సముదాయానికి 5 ఎకరాల స్థలం కేటాయించాలని నియోజక వర్గ ముదిరాజు కుల సంఘ నాయకులు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ ను కలిశారు. కొత్తకొండ దేవస్థానములో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. నియోజక వర్గములో పెద్ద సామాజిక వర్గమైన ముదిరాజుల అవసరాల కోసం, అభివృద్ధి కోసం ఆదరణ చూపాలని కోరారు. పోతారం గ్రామ శివారులో సర్వే నంబర్ 54 లో గల 5 ఎకరాల ప్రభుత్వ భూమిని సంఘ భవన సముదాయానికి కేటాయించాలని గత ప్రభుత్వ హాయములోనే ప్రతిపాదనలు పంపడమైనది. ఎన్నికల కోడ్ తదితర కారణాల వల్ల కేటాయింపు జరుగక పెండింగులో ఉంది. ముదిరాజ్ విద్యార్థుల వసతి గృహం, చేపల మార్కెటింగ్, కల్యాణ మండపం, పెద్దమ్మ గుడితో కూడిన సమగ్ర ముదిరాజు సంఘ భవన సముదాయానికి కేటాయించాలని కోరారు. మంత్రి స్థల కేటాయింపులో చొరవ చూపాలని, తదంతరం సంఘ భవనానికి కావాల్సిన నిధులు కేటాయించాలని సంఘ నాయకులు విన్నవించగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, సిద్దిపేట జిల్లా కలెక్టర్ తో మాట్లాడి పని జరిగేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. నియోజక వర్గములో ముదిరాజుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని, గత మాసములో కూడా హుస్నాబాద్ పట్టణ ముదిరాజు భవన రీడింగ్ రూమ్ నిర్మాణానికి 50 లక్షలు మంజూరు చేయించానని అన్నారు. నియోజక వర్గంలోని మత్స పారిశ్రామిక సహకార సంఘ భవనాలకు కూడా నిధులు కేటాయిస్తానన్నారు. మంత్రి హామీ పట్ల నాయకులు హర్షాన్ని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమములో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, పెండ్యాల ఐలయ్య, పొన్నబోయిన శ్రీనివాస్, పొన్నం మల్లయ్య, దొంతరబోయిన శ్రీనివాస్, జనవేణి శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వేముల శ్రీనివాస్, గట్టు ప్రశాంత్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కాశ బోయిన రవి, పులికాసి రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# పద్మశాలీలు భవిష్యత్తులో సమాజ సేవ చేసే స్థాయికి ఎదగాలి

జనగామ ఆగస్ట్ 10 (ప్రజామంటలు):

పద్మశాలీలు భవిష్యత్తులో సమాజ సేవ చేసే స్థాయికి ఎదిగి సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందాలని పద్మశాలి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి నేత, స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ జాతీయ ఐక్యవేదిక ఇన్చార్జి గజ్జల దామోదర్ నేత పిలుపునిచ్చారు. శనివారం చిల్పూర్ మండలం లోని పోలీస్ స్టేషన్లో నూతనంగా సబ్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన నవీన్ కుమార్ ను పద్మశాలి సంఘం నేతలు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదిగి పద్మశాలి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ పద్మశాలి ఆర్థికంగా రాజకీయ రాజకీయంగా ఎదగాలని వారు కోరారు. పద్మశాలి సామాజిక వర్గంలో పుట్టి కష్టపడి ఉన్నత చదువు చదివి సబ్ ఇన్స్పెక్టర్గా ఎదిగిన నవీన్ కుమార్ ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ మండల జాతీయ ఐక్యవేదిక అధ్యక్షులు బండ రాజ్ కుమార్ నేత, తుడి శ్రీధర్ నేత, యువత నియోజకవర్గ ఇన్చార్జి పేరాల నాగభూషణం నేత తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాలు దొంగతనాలు చేస్తున్న ఘరానా దొంగ మరియు ఆ వాహనాలు కొన్న ఇద్దరు నిందితుల అరెస్ట్

## 6 లక్షల విలువ గల 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

## వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్






జగిత్యాల ఆగస్ట్ 10 (ప్రజామంటలు):

జిల్లా పరిధిలోని మెట్పల్లి, కోరుట్ల, జగిత్యాల టౌన్, గొల్లపల్లి మరియు నిజామాబాదు జిల్లా పరిధిలోని ఆర్మూర్, కమ్మర్పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో గత కొంతకాలంగా హండిల్ లాక్ వేయని ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను మరియు అట్టి దొంగ సొత్తును కొన్న మరో ఇద్దరు నిందితులని అరెస్ట్ చేసిన మెట్పల్లి పోలీసులు. వీరి నుండి ఇరువై(20) ద్విచక్రవాహనాల (వాటి విలువ ఆరు లక్షల రూపాయలు) పోలీస్ వారు స్వాదినం చేసుకున్నారు. ఈ అరెస్ట్ కి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడిస్తూ....... నిజామాబాదు జిల్లా ఏర్గట్ల మండలం, గుమ్మిర్యాల గ్రామానికి చెందినా నిందితుడు (ఏ-1) మన్నే లక్ష్మన్ తండ్రి పోశెట్టి, వయస్సు: 45 కులం: ఎస్టీ నాయకపోడ్ అనే వ్యక్తి గతంలో ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేసుకుని జీవించేవాడు. ఈ క్రమంలో ఒక ప్రమాదంలో అతని కాలు విరగడంతో డ్రైవర్ వృత్తి మానేసి, ఖాళీగా తిరుగుతూ మద్యానికి మరియు జల్సాలకు అలవాటు పడి, సులువుగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశ్యంతో ఏదైనా దొంగతనాలు చేయాలని, అలా దొంగతనం చేసిన సొత్తు ని అమ్మటం ద్వార వచ్చే డబ్బుతో జల్సాలు చేయాలనీ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో హండిల్ లాక్ వేయని బైక్ ల దొంగతనం అయితే సులువుగా ఉంటుందని అనుకుని బైక్ లని దొంగతనం చేయడానికి నిర్ణయించుకున్నాడు. ఇందుకుగాను ముఖ్యంగా సాయంత్రం సమయంలో చీకటి పడినాక జన సంచారం ఎక్కువగా ఉండే మార్కెట్ ఏరియా, హాస్పిటల్స్ ముందు, బస్సు స్టాండ్స్ వద్ద, మరియు వివిధ షాప్ ల ముందు ద్విచక్రవాహనదారులు హడావిడిలో వారి వాహనాలకి హండిల్ లాక్ వేయకుండా మరిచిపోయిన బైక్ లే లక్ష్యంగా ద్విచక్రవాహనాలను దొంగతనం చేయాలనీ నిర్ణయించుకున్నాడు. ఇందుకుగాను నిందితుడు (ఏ-1) ముందుగ వివిధ రకాల మోటార్ సైకిల్ లకి సంబందించిన తాళం చేవిలని సేకరించి వాటి సహాయంతో మోటార్ సైకిల్ చోరిలకు పాల్పడేవాడు. ఈ విధంగా గత సంవత్సర%శీ% నుండి నుండి నిందితుడు (ఏ -1) జగిత్యాల మరియు నిజమాబాద్ జిల్లాలలో మొత్తం (20) ద్విచక్రవాహనాలు చోరికి పాల్పడినాడు.

**జిల్లాల వారిగా పోలీస్ స్టేషన్ వారిగా వాటి వివరాలు:**

మొత్తం (20) ద్విచక్రవాహనాలు. జగిత్యాల జిల్లా పరిధిలో (13): మెట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో(4), కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో (1), జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో (6), రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో (1), సారంగాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో (1), నిజామాబాదు జిల్లా: మొత్తం (7) ద్విచక్రవాహనాలు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో (3), నందిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో(3), కమ్మర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో (1) ఈ విధంగా దొంగతనం చేసిన 20 ద్విచక్రవాహనాలను నిందితుడు (ఏ-1) నిర్మల్ జిల్లా, మామడ మండలం, పొంకల్ గ్రామానికి చెందిన, నిందితుడు(ఏ-2) మొహమ్మద్ మోసిన్, తండ్రి పేరు: ఇక్బాల్, వయస్సు: 27 సం. కులం: ముస్లిం, వృత్తి: చికెన్ షాప్ నిర్వహణ మరియు నిందితుడు (ఏ-3) అబ్దుల్ రషీద్, తండ్రి పేరు: ఖాదిర్, వయస్సు: 26 సం. కులం: ముస్లిం, వృత్తి: బైక్ మెకానిక్ షాప్ నిర్వహణ అనువారికి చెరో (10) ద్విచక్రవాహనాలని ఒక్కో ద్విచక్రవాహనాన్ని 8,000 నుండి 10,000 రూపాయల చొప్పున అమ్మి వచ్చిన డబ్బులని తన జల్సాలకి ఖర్చు చేసేవాడు.

నిందితులు (ఏ-2) మరియు (ఏ-3) లు నిందితుడు (ఏ-1) వారికీ అమ్మిన ద్విచక్రవాహనాలు దొంగ సొత్తు అని తెలిసికూడా వాటిని నిందితుడు (ఏ-1) వద్ద తక్కువ ధరకు కొని వాటిని గ్రామంలోని అమాయక ప్రజలకి ఎక్కువ ధరకి అమ్ముకునే వారు మరియు ఎవరైనా ద్విచక్రవాహనాల పేపర్స్ అడిగితే వారికీ రేపు ఇస్తాము, మాపు ఇస్తాము అని మబ్య పెట్టి తప్పించుక తిరిగేవారు. గత కొంత కాలంగా జరుగుతున్న ద్విచక్రవాహనాల చోరిలపై ప్రజల నుండి వచ్చిన పిర్యాదు మేరకు పోలీస్ వారు ప్రత్యేకంగా దృష్టిసారించి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఆదేశాల మేరకు, మెట్పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్ రావు పర్యవేక్షణలో, మెట్పల్లి సిఐ నిరంజన్ రెడ్డి మరియు మెట్పల్లి ఎస్సై చిరంజీవి మరియు వారి సిబ్బంది అందుబాటులో ఉన్న టెక్నాలజీ ని ఉపయోగించుకుంటూ, ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం వెతుకుతుండగా ఈ రోజు అనగా తేది:.10-08-2024, మధ్యాహ్నం 12:00గం. మెట్ పల్లి లోని వెంకటరావుపేట్ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో ఒక ద్విచాక్రవహనం పైన వస్తున్న నిందితున్ని(ఏ-1) పట్టుకొని విచారించగా నిందితుడు (ఏ-1) ఇదివరకు పాల్పడిన ద్విచక్రవాహనాల చోరిలని అంగీకరించాడు మరియు నిందితుడు (ఏ-1) ఇచ్చిన సమాచారంతో మిగతా నిందితులు (ఏ-2 అండ్ ఏ-3) ల దొంగ సొత్తు (ద్విచక్ర వాహనాలు) కొన్న వారిని అరెస్ట్ చేయడంతో పాటు చోరికి పాల్పడిన ద్విచక్రవాహనాలని (20) వారి వద్ద రికవరీ చేయనైనది. ఇట్టి ద్విచక్రవాహనాల చోరికి పాల్పడుతున్న నిందితుడిని మరియు దొంగ సొత్తు కొన్న నిందితులని చాక చక్యంగా పట్టుకున్న మెట్ పల్లి సిఐ. నిరంజన్ రెడ్డి మరియు ఎస్సై చిరంజీవి, కానిస్టేబుల్స్ కిరణ్ మరియు సంతోష్ లను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో డిఎస్పి ఉమామహేశ్వర రావు, మెట్పల్లి సి.ఐ నిరంజన్ రెడ్డి, ఎస్సై చిరంజీవి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాసకర్తలకు వినతి

రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.

mantalukathalu@gmail.com

-ఎడిటర్

# నగరంలో డిజిటల్ సర్వే

**చాపకింది నీరులా వివరాల సేకరణ**

**సమగ్రతకోసమే అంటున్న ఆమ్రపాలి**

**అయినా ప్రజల్లో తొలగని అనుమానాలు**

హైదరాబాద్,ఆగస్ట్9 (ప్రజామంటలు):

హైదరాబాద్‌లో ఇప్పుడు ఇంటింటి సర్వే జరగబోతోంది. గతంలో టిఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇంటింటి సర్వే జరిపింది. దాని వల్ల ఒనగూరిన ప్రయోజనాలేంటో తెలియదు. దాని వివరాలు కూడా బయట పెట్టలేదు. తాజాగా నగరంలో కొత్తగా చేపట్టే సర్వే దేనికి ఉద్దేశించిందో కూడా చెప్పడం లేదు. అయితే డిజిటల నంబర్లు కేటాయిస్తామని అంటున్నా..ఆస్తి మదింపునకే అన్న విమర్శలు కూడా ఉన్నాయి. సర్వేపై ఎలాంటి అపోహలు అసవరం లేదని కమిషన్ ఆమ్రపాలి స్పష్టం చేశారు. జీఐఎస్ సర్వేతో ఇంటింటికీ ఓ డిజిటల్ అడ్రెస్ ఐడీ ఇస్తారని దాని ఆధారంగానే ఇకపై సేవలు అందుతాయని పేర్కొన్నారు. ఈ ఐడీని ప్రతి ఇంటికి అతికిస్తారని తెలిపారు. సర్టిఫికేట్లు ఇతర డాక్యుమెంట్లు ఈ ఐడీ ఆధారంగానే నేరుగా ఇంటికి వచ్చే వెసులుబాటు ఉందన్నారు. అత్యవసర సేవలు కూడా వేగంగా అందుకోవచ్చని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల్లో జరిగే అలసత్వాన్ని కట్టడి చేయొచ్చని అంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజలకు మెరుగైనా సేవలు అందించేందుకు జీఐఎస్ సర్వే నిర్వహిస్తున్నట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి తెలిపారు.

ప్రభుత్వ, ప్రైవేటు సేవల్లో జవాబుదారీతనం పెంచేందుకు ఈ సర్వే ఉపయోపడుతుందని అన్నారు. సర్వే చేస్తున్నారని తెలిసి ప్రజల్లో ఉన్న భయాందోళనలు తొలగించే ప్రయత్నం చేశారు. సర్వే అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, యుటిలిటీస్ జియో ఫెన్సింగ్ అవుతాయన్నారు. సర్వే కోసం ఇంటికి వచ్చే సిబ్బంది వ్యక్తిగత సమాచారం అడగబోరని అమ్రపాలి అన్నారు. ఆధార్, పాన్ కార్డ్ వివరాలు తెలుసుకోరని పేర్కొన్నారు. సర్వే చేసే సిబ్బంది ఆ ప్రాంతంలో ఉన్న భవనాలు సొంత భవనాలా, ప్రభుత్వ భవనాలా, వాణిజ్య భవనాలా, అపార్టమెంటా, గ్రూప్ హౌసింగ్, లేకా ప్రార్థనా మందిరమా, ఖాళీ స్థలాలు ఎవరిది అనేది తెలుసుకో నున్నారు. భవనం లేదా ప్లాట్ ఫొటోలు.

భవనానికి పేరుంటే పేరు, ఇంటిముందు రోడ్డు వెడల్పు, ఫ్లింత్ ఏరియా, ఎన్ని అంతస్తులు, ఎన్ని ప్లాట్స్, ఎన్ని లిఫ్టులు, పార్కింగ్ ఏరియా ఎంత, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్ల వివరాలు సేకరిస్తారని తెలుస్తోంది. ఈ సర్వే కాస్ట్ రూ. 22 కోట్లుగా చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు 158 కిలోమీటర్ల మేర డ్రోన్ సర్వే పూర్తయినట్టు తెలిపారు. 1,14,020 ఇళ్ల డిజిటలైజేషన్ జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం హైదర్ నగర్, మియాపూర్, చందానగర్, కేపీహెచ్ బీకాలనీ, ఉప్పల్, హయత్‌నగర్‌లో సర్వే నడుస్తోందన్నారు.

విద్యుత్, నల్లా బిల్లులు ఇవ్వాల వద్దా అనేది ఎవరి వ్యక్తిగత నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే చాలా రాష్ట్రాలు, నగరాల్లో ఈ సర్వే చేపట్టారని తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఇలాంటి సర్వే విజయవంతంగా పూర్తి అయిందన్నారు. జీఐఎస్ సర్వే ఇప్పటి వరకు హైదరాబాద్‌లో జరగలేదని అలా జరిగితే స్టార్టప్ కంపెనీలు వచ్చేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. శాటిలైట్, డ్రోన్, ఇంటింటి పర్యటనతో తీసుకున్న వివరాల ఆధారంగా జరిగే మ్యాపింగ్‌తో జరిగే ప్రయోజనాలు భవిష్యత్‌లో ప్రజలు తెలుసుకుంటారని అన్నారు.

కబ్జా అనే మాట లేకుండా చేయొచ్చని తెలిపారు. చెత్త సేకరించే వాళ్లు తమ ఇంటికే కొన్నిసార్లు రావడం లేదని దాని వల్ల ఇబ్బంది పడుతున్నామని పలువురుఅన్నట్లు అమ్రపాలి ఉదాహరిస్తూ... ఇక ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు కూడా ఉన్నాయని... ఇకపై చెత్త సేకరించిన ఇంటి నెంబర్ ఫోన్లో అప్‌లోడ్ చేస్తే ఆ ఇంటి నుంచి చెత్త తీసుకున్నట్టు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అవుతుందని తెలిపారు. అలా హైదరాబాద్‌లో ఎన్ని ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తున్నారు. ఎంత సిబ్బంది కావాల్సి ఉంటుందనే తెలుస్తుందన్నారు. ఈ సర్వేపై ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదని కేవలం భవనాల వివరాలు, పీటీఐఎన్ వివరాలు మాత్రమే తెలుసుకుంటారని పేర్కొన్నారు. అంతుకు మించిన వివరాలు అడగబోరని అన్నారు. ప్రజలు చెప్పే వివరాలు జీహెచ్ఎంసీకి మాత్రమే తెలుస్తాయని వేరే వ్యక్తులకు తెలిసే ఛాన్స్ లేదన్నారు. గోప్యత పాటిస్తామని వివరించారు. పొరపాటున తప్పుడు సమాచారం ఇచ్చినా తర్వాత సరిచేసుకునే వీలు కూడా ఇస్తామన్నారు. ఓనర్‌షిప్ వివరాలు పట్టించుకోబోమని తెలిపారు.

# రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్ " కథాకమామిషు

## విజ్ఞానరత్న పురస్కార తొలి గ్రహీత గోవిందరాజన్ పద్మనాభన్





జాతీయ స్థాయిలో ఈ ఏడాది నుండే కొత్తగా ప్రారంభించిన "రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్" అవార్డులను కేంద్ర ప్రభుత్వం 7 ఆగస్టు 2024 న ప్రకటించింది. శాంతి స్వరూప్ భట్నాగర్ ప్రైజ్‌తో సహా ఇప్పటికే ఉన్న అన్ని సైన్స్ అవార్డులను రద్దుచేసి ఈ కొత్త అవార్డులను ఈ సంవత్సరం నుండి ఇవ్వాలని గత యేడాది నిర్ణయించారు. వీటిని శాస్త్ర, సాంకేతిక రంగాలలో అత్యుత్తమ స్ఫూర్తి దాయకమైన ఆవిష్కరణల రూపకర్తలకు వ్యక్తిగతంగా లేదా జట్టుకు( టీమ్ ) అందిస్తారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో సుమారు మూడువందల అవార్డులను ఏకీకృతం చేయడం ద్వారా వివిధ విభాగాల్లో శాస్త్రీయ నైపుణ్యాన్ని గుర్తించడానికి ఈ కొత్త అవార్డులు ఒక వేదిక కాబోతుంది. ఇవి శాస్త్ర సాంకేతిక రంగాలలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలలో తదుపరి తరం శాస్త్రవేత్తలను ప్రోత్సహించి ఉత్తేజం ఉత్సాహాన్ని ఇనుమడింపజేస్తాయి. విజ్ఞాన్ యువ అవార్డులు ప్రత్యేకంగా యువ శాస్త్రవేత్తలపైనే దృష్టి సారిస్తాయి. వీటిలో జట్టు లేదా బృంద అవార్డును చేర్చడం ద్వారా ఆధునిక శాస్త్రీయ ప్రయత్నాలలో సహకార పరిశోధన యొక్క ప్రాముఖ్యతను గుర్తించవచ్చు. ఈ అవార్డులు శాస్త్రీయ విజయాల స్థితిని అంతర్జాతీయ స్థాయికి పెంచుతాయి. సైన్స్ అండ్ టెక్నాలజీలో కెరీర్‌లను కొనసాగించడానికి మరింత మంది శాస్త్రవేత్తలను ప్రేరేపిస్తాయి.



ఏయే రంగాలలో ఇస్తారు:

పదమూడు రంగాలకు చెందిన శాస్త్రవేత్త(లు)లను ఎంపిక చేస్తారు. అవి భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం , జీవశాస్త్రం, గణితం మరియు కంప్యూటర్ సైన్స్, భూగర్భ శాస్త్రం, వైద్యం, ఇంజనీరింగ్, వ్యవసాయం, పర్యావరణ శాస్త్రం , నూతన సాంకేతిక ఆవిష్కరణలు , అణుశక్తి, అంతరిక్షం, ఇతర శాస్త్రాలు. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా గౌరవ రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డులను అందజేస్తారు. నాలుగు విభాగాలలో ఈ పురస్కారాలు అందజేయబడతాయి.

విజ్ఞానరత్న (విఆర్ ):

ఈ అవార్డు జీవితకాలంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో విజయాలు సాధించిన విశిష్ట వ్యక్తులకు గరిష్టంగా మూడు అవార్డులు ఇవ్వబడతాయి.

విజ్ఞాన్ శ్రీ (వియస్):

శాస్త్ర సాంకేతిక రంగాలలో విశేషంగా కృషి చేసిన వ్యక్తులకు గరిష్టంగా 25 అవార్డులు బహుకరిస్తారు.

విజ్ఞాన్ యువ బిశాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు (వి వై యస్ యస్ బి):

శాస్త్ర సాంకేతిక రంగాలలో విశేష కృషి చేసిన యువ శాస్త్రవేత్తలకు గరిష్టంగా 25 అవార్డులు ఇవ్వబడతాయి.

విజ్ఞాన్ టీమ్ (విటి) అవార్డు:

శాస్త్ర సాంకేతిక రంగాలలో అసాధారణమైన కృషి చేసిన ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది శాస్త్రవేత్తలు, పరిశోధకుల బృందానికి ఈ గౌరవం ఇవ్వబడుతుంది. ఈ విభాగంలో మూడు అవార్డులు ఇస్తారు.

తొలి అవార్డులు వీరివే :

ఈ ఏడాది ప్రభుత్వం వివిధ రంగాలలో మొత్తం 33 రాష్ట్రీయ విజ్ఞాన పురస్కారాలను ప్రకటించింది.

విజ్ఞాన రత్న మొదటి గ్రహీత:

ప్రముఖ జీవరసాయన శాస్త్రవేత్త గోవిందరాజన్ పద్మనాభన్ తొలి విజ్ఞానరత్న పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈయన మద్రాసులోని ప్రెసిడెన్సీ కళాశాలలో రసాయనశాస్త్రంలో డిగ్రీని పూర్తి చేసి న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో సాయిల్ కెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. 1966లో బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బయోకెమిస్ట్రీలో డాక్టరేట్ పొందారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐయస్సి) మాజీ డైరెక్టర్. మలేరియా పరాన్నజీవిపై చేసిన పరిశోధనలకు అంతర్జాతీయంగా ఎంతో ప్రశంసలు అందుకున్నారు. ఇంతకు ముందే పద్మభూషణ్, పద్మశ్రీ, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులు కూడా లభించాయి. అతను ప్రస్తుతం ఐఐయస్సిలో బయోకెమిస్ట్రీ విభాగంలో గౌరవ ప్రొఫెసర్‌గా, తమిళనాడు సెంట్రల్ యూనివర్శిటీ ఛాన్సలర్‌గా పనిచేస్తున్నారు.



విజ్ఞాన్ శ్రీ గ్రహీతలు:

అన్నపురిణి సుబ్రమణియన్ (ఆస్ట్రోఫిజిక్స్), ఆనందరామకృష్ణన్ (వ్యవసాయ శాస్త్రం), అవేష్ కుమార్ త్యాగి (అటామిక్ ఎనర్జీ), ఉమేష్ వర్ష్నే, జయంత్ భాలచంద్ర ఉద్గాంకర్ (జీవ శాస్త్రాలు), సయ్యద్ వాజిహ్ అహ్మద్ నఖ్వీ (ఎర్త్ సైన్సెస్), భీమ్సింగ్( ఇంజనీరింగ్ సైన్సెస్), ఆదిమూర్తి ఆది, ప్రొఫెసర్ రాహుల్ ముఖర్జీ( గణితం మరియు కంప్యూటర్ సైన్స్), సంజయ్ బిహారీ (మెడిసిన్), లక్ష్మణన్ ముత్తుసామి, నాబా కుమార్ మోండల్ (భౌతిక శాస్త్రం), రోహిత్ శ్రీవాస్తవ (టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్)లు విజ్ఞాన్ శ్రీ పురస్కారాన్ని పొందిన వారిలో ఉన్నారు.

విజ్ఞాన యువ:

కృష్ణ మూర్తి , స్వరూప్ కుమార్ పరిదా (వ్యవసాయ శాస్త్రం), రాధాకృష్ణన్ మహాలక్ష్మి, అరవింద్ పెన్మత్స (జీవ శాస్త్రాలు), వివేక్ పోల్శెట్టివార్, విశాల్ రాయ్ (రసాయన శాస్త్రం), రాక్సీ మాథ్యూ కోల్ (ఎర్త్ సైన్సెస్), అభిలాష్, రాధాకృష్ణ గంటి (ఇంజనీరింగ్ సైన్సెస్),
పురాబి సైకియా, బప్పిపాల్ (పర్యావరణ శాస్త్రం),
మహేష్ రమేష్ కక్డే (గణితం మరియు కంప్యూటర్ సైన్స్), జితేంద్ర కుమార్ సాహు, ప్రగ్యా ధ్రువ్ యాదవ్( మెడిసిన్ ), ఉర్బాసి సిన్హా (భౌతిక శాస్త్రం), దిగేంద్రనాథ్ స్వైన్, ప్రశాంత్ కుమార్( స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ), ప్రభు రాజగోపాల్ ( టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్) విజ్ఞాన యువ పురస్కార గ్రజీతలుగా నిలిచారు.

విజ్ఞాన టీమ్:

చంద్రయాన్-3 లో పాలు పంచుకున్న శాస్త్రవేత్తలకు విజ్ఞాన యువ పురస్కారాన్ని అందుకోనున్నారు.

**జనక మోహన రావు దుంగ**
**యం.యస్సీ ( ఫిజిక్స్ )**
**ఫోన్: 8247045230**

# బడ్జెట్ సమావేశాలు ముగించారు !

కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి వచ్చి ఏడాది కావస్తోంది. కొత్త భవనంలో పాత విధానాలతోనే కార్యక్రమాలు సాగుతున్నాయి. సరైన చర్చలకు ఆస్కారం కలగడం లేదు. బడ్జెట్ సమావేశాలు కూడా యథాలాపంగా సాగాయి. పెద్దగా చర్చలు సాగలేదు. బడ్జెట్ క్రతువును ముగించేలా నిర్ణయాలు జరిగాయి. మమ అనిపించి పార్లమెంట్ సమావేశాలు ముగించారు. ఎప్పుడూ నాలుగైదు రోజులు ముందే సమావేశాలు ముగుస్తున్నాయి. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలు వారికి కానరావడం లేదు. బంగ్లాదేశ్‌లో ఊచకోతలపైనా చర్చించలేదు. కనీసం చర్చించివుంటే..ప్రపంచం దృష్టికి దాష్టీకాలను తీసుకుని వచ్చే అవకాశం ఉండేది. ఇకపోతే ప్రధాన సమస్యలపైనా చర్చ చేయలేదు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఎప్పటిలాగే తిరస్కరించారు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక చరిత్ర సృష్టించే నిర్ణయాలు తీసుకుంటుందని ఆశించారు. కానీ అలాంటి దేమీ కనిపించలేదు. జిఎస్టీపై ప్రశ్నలు లేవనెత్తితే ..అది ప్రజల సమస్యగా భావించి చర్చించాల్సిన ప్రభుత్వం విపక్షాలను ఎండగట్టేలా సమాధనం చెప్పిన తీరు జాతి మరువదు. మూడోదఫాలో మరింత సమర్థంగా,మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్న మోడీ వచనాలు ఎక్కడా ప్రతిఫలించలేదు. దేశంలో అభివృద్ది లక్ష్యంగా కార్యక్రమాలు సాగుతున్నాయన్న నమ్మకం కలిగించలేకపోయారు. ప్రజల సమస్యలను విస్తృతంగా చర్చించాలి. ఇందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వడం ద్వారా సమస్యలప చర్చ జరిపి ఉంటే బాగుండేది. విపక్షాలు కూడా ఉపన్యాసాలకు, రాజకీయ వ్యాఖ్యలకు అలవాటు పడ్డారు. అందువల్ల సమస్యలను గుర్తించ చర్చించాలన్న ఆలోచన లేకుండా సాగుతున్నారు. ఇకపోతే దేశహితం కోసం మరిన్ని కఠిన చట్టాలను రూపొందించాలి. చర్చల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలి. ఎన్నికల్లో అక్రమాలు నిరోధించేలా నిర్ణయాలు రావాలి. అయితే బడ్జెట్ సమావేశాల్లో మరిన్ని నిర్ణయాల కోసం ప్రజలు ఎదురు చూసినా ఫలితం దక్కలేదు. తిరంగా యాత్రను ప్రారంభించారు. ప్రజల్లో దేశభక్తి లేక కాదు. ప్రజల్లో ఉన్నంతగా నేతల్లోనూ భక్తి రావాలి. ప్రజల జీవన ప్రమాణాలు పడిపోకుండా చూడాలి. వారు అప్పుల్లో కూరుకుపోకుండా బతికేలా నిర్ణయాలు ఉండాలి. కానీ అలాంటి ప్రయత్నాలు కానరావడం లేదు. అలాగే పార్లమెంట్ సీట్ల సంఖ్యను పెంచడం... గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం కూడా అత్యవశ్యకమే. గవర్నర్ వ్యవస్థ ఈ మధ్యకాలంలో రాజకీయాంగా దుమారం రేపుతోంది. అలాగే ఖాజానాపైనా భారీగా భారం పడుతోంది. గవర్నర్ వ్యవస్థలేని రాజ్యాలను నడుపుకోవాల్సి ఉంది. అలాగే ఎప్పుడో 50 ఏళ్ల క్రితం ఉన్న జనాభాకు అనుగుణంగా పార్లమెంట్ సీట్లు ఉన్నాయి. 542 సీట్లతోనే కొనసాగిస్తున్నాం. ఈ క్రమంలో లోక్‌సభ, రాజ్యసభలతో పాటు, అసెంబ్లీల్లో సీట్ల సంఖ్య పెరగాల్సి ఉంది. వాటిని ప్రస్తుత జనాభాకు అనుగుణంగా పెంచు కోవాల్సిందే. కనీసం వేయి సీట్లు ఉంటేనే ఇప్పుడున్న జనాభాకు తగిన ప్రాతినిధ్యం దక్కదు. 140కోట్లు ఉన్న జనాభాకు అనగుణంగా పార్లమెంట్ సీట్లను పెంచుకోవాలి. అలాగే దేశానికి అనవసర వ్యవస్థగా ఉన్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి. పంచాయితీల్లో ఎంపిటిసిలు,జడ్పీటీసిల వ్యవస్థను ఎత్తేయాలి. పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను దేశ, రాష్ట్రాల జనాభాకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ జరగాలి. ఒకేదేశం, ఒకే చట్టం కోసం కసరత్తు జరుగుతున్న వేళ ఇలాంటి కీలక నిర్ణయాలు కూడా జరగాలి. ఇలాంటి అంశాలపై పార్లమెంటులో చర్చించివుంటే బాగుండేది. ఇకపోతే ఎపిలో కాకినాడను ఆనుకుని ఉన్న యానాంను పాండిచ్చేరిలో కాకుండా ఎపిలో విలీనం చేయడమే మంచిది. దీంతో ప్రజలకు కూడా పాలనా కేంద్రం దగ్గర కాగలదు. దీనిపై పాలకులు ఎందుకనో డిమాండ్ చేయడం లేదు. ఇలాంటి అసమానతలను చర్చిస్తే మంచిది.

ఇందుకోసం పార్లమెంటులో చర్చించాలి. వ్యవస్థల ద్వారా మేలు జరగాలి. ఉపయోగం కలగాలి. అంతేకానీ గుదిబండగా మారరాదు. అలాగే ఆర్థిక భారంగా కూడా మారరాదు. దేశంలో ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పటిష్టమైన ఎన్నికల విధానం కూడా అవసరం ఉంది. ఇవన్నీ చర్చించడం ద్వారా నవ భారతానికి శ్రీకారం చుట్టాలి. స్వాతంత్ర్యోత్సవాలు జరుపుకుంటున్న వేళ ఇవన్నీ చర్చిస్తే మంచింది. అలాగే మహిళల ప్రాతనిధ్యం పెంచే మహిళా బిల్లును కూడా ఆమోదింప చేయడం, కోల్డ్‌స్టోరేజీకి పంపడం జరిగింది. మొన్నటి ఎన్నికల నుంచే దీనిని అమలు చేసివుంటే మహిళలకు న్యాయం జరిగివుండేది. 370 ఆర్టికల్‌ను రద్ద చేయడం లాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న మోడీ ప్రభుత్వానికి ఈ నిర్ణయాలు ఏమంత పెద్దవి కాక పోవచ్చు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఆదర్శ రాజకీయాలకు శ్రీకారం చుట్టాలి. ఇకపోతే పార్లమెంట్ వర్షకాల సమావేశాలు శు క్రవారంతోముగిశాయి. లోక్ సభ వాయిదా పడిన వెంటనే స్పీకర్ ఓం బిర్లా తేనిటి విందు ఇచ్చారు. టీ పార్టీకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ సా, కిరణ్ రిజిజు, రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, ఎంపీలు సుదీప్ బందోపాధ్యాయ, కనిమోళి తదితరులు హాజరయ్యారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. స్పీకర్ తేనీటి విందుకు హాజరైన ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎప్పుడూ ఉప్పు, నిప్పుగా ఉండే వీరు కలిసి ఫొటోలకు ఫోజిచ్చారు. వాస్తవానికి లోక్ సభ ఆగస్ట్ 12వ తేదీన వాయిదా పడాలి. సభా వ్యవహారాలు పూర్తయినందున సమావేశాలు ముగించామని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈసారి సభకు ఎక్కువ మంది సభ్యులు హాజరయ్యారని వివరించారు. సమావేశంలో బడ్జెట్ బిల్లుకు ఆమోదం లభించింది. జమ్ముకశ్మీర్ విభజన బిల్లు, ఇండియన్ ఎయిర్ క్రాఫ్ట్ బిల్లులకు కూడా సభ ఆమోదం లభించింది. వక్ఫ్ బిల్లుపై జెపిసిని వేశారు. ఇంతకు మించి ఈ సమావేశాల్లో పెద్దగా ప్రయోజనం చేకూర్చే అంశాలు లేవు.



## మాణిక్యేశ్వర్ నగర్ లో డెంగ్యూ మెడికల్ క్యాంపు

సికింద్రాబాద్ ఆగస్టు 10 (ప్రజామంటలు):
సికింద్రాబాద్ మానికేశ్వర్ నగర్ లో సీతాఫల్మండి కుట్టి వెల్లోడి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం డెంగ్యూ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీ ప్రజలకు రక్త పరీక్షలు, బీపీ చెక్ అప్ చేసి మందులను అందజేశారు. క్యాంపులో పీహెచ్ఎన్ శ్యామల, మలేరియా అధికారి శంకర్, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## టిపిఎస్ఎఫ్ కమిటీ నూతన అధ్యక్షులుగా వంశీధర్ రెడ్డి




మల్లాపూర్ ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
జగిత్యాల జిల్లా లోని పంచాయతీ కార్యదర్శుల మీటింగ్లో జిల్లా జగిత్యాల కు సంబంధించిన తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ (టిపిఎస్ఎఫ్) నూతన కమిటీకి అధ్యక్షులుగా వంశీధర్ రెడ్డి, మల్లాపూర్ జనరల్ సెక్రెటరీగా నరేష్ ని ఎన్నుకోవడం జరిగింది.గౌరవ అధ్యక్షులుగా జె. కొమురయ్య, ఉపాధ్యక్షులుగా రాజు నాయక్, ఏ. శేఖర్, రవీందర్ రెడ్డి, అర్ఫొద్దీన్ లను ఎన్నుకున్నారు.

## నిరాశ్రయులకు అల్పాహారం



జనగామ ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
తిప్పారపు రాజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా జనగామ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ స్థానిక రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో నిలువ నీడలేని నిరాశ్రయులకు అనాథలకు అల్పాహారం అందించి ఒక పూట ఆకలి తీర్చి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు మద్దెల కార్తిక్, లఖన్ సింగ్,అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.




## పేద మహిళలకు సామూహికంగా శ్రీమంతాలు

జనగామ ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
జనగామ పట్టణంలో కల్కి భగవాన్ ఆలయంలోకల్కి భగవాన్ సేవా సమితి వారి ఆధ్వర్యంలో 35 మంది పేద మహిళలకు సామూహికంగా శ్రీమంతాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీమంతము చేసుకున్న మహిళలు మాకు మా ఇండ్లలో మా అన్న తమ్ముళ్లు మా అమ్మ నాన్నలు ఎవరు చేయని శ్రీమంతం కార్యక్రమము ఇంత అద్భుతంగా జరిపించిన కల్కి భగవాన్ సేవకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# జర్నలిస్టులు దీక్షలు చేయడం దురదృష్టకరం

### మాజీమంత్రి కొప్పుల





జగిత్యాల ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
ఇండ్ల స్థలాల కోసం జర్నలిస్టులు దీక్షలు నిర్వహించడం దురదృష్టకరమని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక తహసిల్ చౌరస్తా వద్ద జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం చేస్తున్న నిరసన దీక్షకు బిఆర్ఎస్ పార్టీ పక్షాన సంఘీభావం ప్రకటించిన మాజీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్,జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంతసురేష్, మాజీ మార్క్ ఫెడ్ మాజీ ఛైర్మన్ లోక బాపురెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్ తో నిరసన చేపడుతూ దీక్ష నిర్వహించడం దురదృష్టకరమన్నారు.

నేను మంత్రిగా పనిచేసిన రోజు రెండు గుంటల స్థలం ఇవ్వాలని ప్రభుత్వ పెద్దలలో కలెక్టర్ లకు ఫోన్ చేయించనమని గుర్తు చేశారు. ప్రభుత్వం, మంత్రిగా అధికారులకు ఇవ్వాలని అన్న ఇద్దరు ప్రజాప్రతినిధులు వైఖరి కారణం అయిందన్నారు. ప్రజలకు, ప్రభుత్వంకు వారధిగా ఉండే జర్నలిస్ట్ లకు ముప్పై ఏళ్లుగా ఇళ్ల స్థలాలు రాకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం ఆలోచన చేసి జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఏ కార్యక్రమం చేపట్టిన జిల్లా బిఆర్ఎస్ పార్టీ పక్షాన అండగా ఉంటాం. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, మాజీ జెడ్పీటీసీలు మహేష్, జలంధర్, నాగం భూమన్న, పాక్స్ చైర్మన్ వెంకట మాధవరావు, మాజీ ఏఎంసి చైర్మన్ నాగేశ్వర్ రావు, వైస్ చైర్మన్ ఆసిఫ్, అర్బన్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మ గంగాధర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పడిగేల గంగారెడ్డి, శీలం ప్రవీణ్, గంగారెడ్డి, లక్ష్మణ్, గంగారాం, గంగాధర్, గాజుల శ్రీనివాస్, యూత్ నాయకులు హరీష్, సన్నిత్ రావు, ప్రతాప్, భగవాన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన కొలుగురి శాంతన్ రావు హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయ (ఏజిపి) వాదిగా నియామకం కాగా నియామకానికి సహకరించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను ఎమ్మెల్యే క్వార్టర్స్ లో కలిసి పుష్ప గుచ్చం అందజేశారు. వెంట మాజీ ఏఎంసి ఛైర్మెన్ దామోదర్ రావు ఉన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్

ఎల్కతుర్తి ఆగస్టు 10 ప్రజా మంటలు
ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు బక్క రవి కుమారుడు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా రైతు రక్షణ సమితి అధ్యక్షుడు వరికిల కిషన్ రావు. నడికుడా మండల ప్రధాన కార్యదర్శి. టింకురాల రాజు నాయకులు హింగే రవీందర్ శ్రీధర్ వెంకటేష్ ప్రకాష్ గౌడ్ వేణు సదానందం సాంబయ్య తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.




## నేడు గాంధీ ఆసుపత్రిలో బోనాల వేడుకలు

సికింద్రాబాద్ ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో నేడు ఆదివారం శ్రీబంగారు మైసమ్మ ఆలయంలో బోనాల వేడుకలను నిర్వహించనున్నారు. గాంధీ ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రతి ఏడాది లాగే ఈసారి కూడ బోనాల వేడుకలను ఘనంగా జరపడానికి నిర్ణయించినట్లు జీడీఎక్స్ సెక్యూరిటీ చీఫ్ శివాజీ తెలిపారు. గాంధీ ఆసుపత్రి ఓపీ బ్లాక్ సమీపంలో కొలువై ఉన్న శ్రీబంగారు మైసమ్మ అమ్మవారి వద్దకు ఆదివారం ఉదయాన్నే మహిళా సెక్యూరిటీ గార్డులు నెత్తిన బోనాలు ఎత్తుకొని, పోతరాజుల విన్యాసాలు, భాజ భజంత్రీల మధ్య ఊరేగింపుగా వెళతారు. అక్కడ శ్రీ బంగారు మైసమ్మ వార్లకు బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకుంటారు. బోనాల ఉత్సవాల విజయవంతానికి సిబ్బంది సహకరించాలని శివాజీ విజ్ఞప్తి చేశారు.



## వాటర్ ట్యాంక్, పైప్ లైన్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

జగిత్యాల అర్బన్ ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
నూకపల్లి సరస్వతి గుట్ట పైన డబల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారుల కోసం 14 కోట్ల తో నిర్మిస్తున్న 14 లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్, పైప్ లైన్ నిర్మాణ పనులను పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. గత 500 ఇండ్ల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు, 4500 డబల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులకు సరస్వతి గుట్ట పైన 14 లక్షల లీటర్ల ట్యాంక్ ఏర్పాటు ద్వారా లబ్ధిచేకూరనుంది అని ఎమ్మెల్యే డా. సంజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్,కమిషనర్ సమ్మయ్య, డీఈ జలంధర్ రెడ్డి, కౌన్సిలర్ లు, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## నూతన రుణాల చెక్కులు ఆందజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రుణ మాఫీ పొందిన రైతులు 248 మందికి 1 కోటి 56 లక్షలు రూపాయల నూతన రుణాల చెక్కులు ఆందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ లు పత్తి రెడ్డి మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, సీఈఓ వేణు, పాక్స్ డైరెక్టర్ లు, లింగన్న, శంకరయ్య, పోచమల్లయ్య, రాజిరెడ్డి, దేవమ్మ, రాజవ్వ, గంగా రాజం, ఆరుముల్ల గంగారం, నీలం లక్ష్మి, నాయకులు క్యాదాసు నాగయ్య, బోనగిరి నారాయణ, అంకం సతీష్, బొడ్డు దామోదర్, పడిగేల స్వామి రెడ్డి, భక్కషెట్టి అంజనేయులు, పోతునుక మహేష్, శ్రీనివాస్, కోటేశ్వర రావు, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాటశాల పేరెంట్స్ కమిటి అధ్యక్షులుగా సాతూరి కిష్టయ్య



ఎల్కతుర్తి ఆగస్టు 10 ప్రజా మంటలు
ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఉన్నటువంటి టీ ఎస్ డబ్లు అర్ ఎస్ సోషల్ వెల్ఫేర్ పాఠశాల లో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు జరగగా నూతన కమిటీ ఎన్నికలు జరగగా అధ్యక్షులుగా సాతురి కిష్టయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షులుగా ఎంపిక చేసినందుకు విద్యార్థుల తల్లి తండ్రులకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు పాఠశాలకు సంబంధించిన అన్ని సమస్యలను విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కార మార్గం ను ప్రయత్నం దిశగా వెళ్తానని ఈ సందర్భంగా వారు అన్నారు నాపై నమ్మకం ఉంచి నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయురాలకు ప్రిన్సిపాల్ కు పేరెంట్స్ కమిటీ పేరెంట్స్ కు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాను

# గంజాయి డ్రగ్స్, మత్తుపదార్థాలపై అవగాహన

## కాజీపేట ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్




వేలేరు ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
వేలేరు మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు , పూర్తిగా నిర్మూలించాలి. అనేటువంటి కార్యక్రమంలో భాగంగా కాజీపేట ఎక్సైజ్ సీఐ వి. చంద్రమోహన్ ఆధ్వర్యంలో వేలేరు మండలంలో ఉన్నతెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ ఆవరణలో సుమారు 500 మంది విద్యార్థుల సమక్షంలో గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలు మత్తు పదార్థాలు వినియోగము, వాటి వల్ల కలిగే దుష్పరి నామాలు పై ఒక అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు సేవించడం వల్ల యువత వారి విలువైన జీవితాన్ని ఏ విధంగా కోల్పోతున్నారు. ఇలాంటి గంజాయి సేవించడం, గంజాయి రవాణా చేయడము, గంజాయి అమ్మడం వలన పెద్ద ఎత్తున కేసులకు గురికావడం, అలాగే వారి విలువైనటువంటి జీవితము నష్టపోవడము తద్వారా పూర్తి స్థాయిలో ఆరోగ్య సమస్యలు రావడం సమాజంలో చిన్నచూపు చూడడాము తద్వారా వారిని నమ్మి ఆశలు పెట్టుకున్నటువంటి తల్లితండ్రులు ఆశలు అడియాశలు కావడం ఇలాంటి దుష్పరినామాలు చోటుచేసుకుంటున్నాయని , ప్రతి ఒక్క విద్యార్థి, యువత వారి జీవితాల నుంచి డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలను పూర్తిగా తరిమివేయాలని తద్వారా వారి జీవితాలను సంతోషంగా ఉంచుకోవాలని సీఐ తెలిపారు. అలాగే సైకియాట్రిస్ట్ ప్రహసిత్ మాట్లాడుతూ.... మత్తుపదార్థాలు సేవించడం వల్ల నర్వస్ సిస్టం ఏ విధంగా కొల్లాప్స్ అవుతుంది. అలాగే ఒక వ్యక్తి మానసికంగా ఏవిధంగా కృంగిపోతున్నాడు అనేటువంటి సమాచారాన్ని చెప్పడం జరిగింది, అలాగే రెసిడెన్షియల్ స్కూల్, కాలేజ్ ప్రిన్సిపల్ విజయ్ మాట్లాడుతూ.... మా స్కూల్ కం కాలేజీలో పిల్లలకు సరైన విధంగా మేము మంచి బాటలో నడిచేలా ప్రతిరోజు వారికి చెప్పడం జరుగుతుందని అలాగే ప్రతి ఒక్క విద్యార్థి, యువత గంజాయి, డ్రగ్స్ మాదకద్రవ్యాలు తీసుకుంటే వారి జీవితం ఏ విధంగా ఉంటుందనేది అలాగే వాటికి బానిస కానటువంటి వారి యువకులు, విద్యార్థుల యొక్క జీవితం ఏ విధంగా ఉంటుంది అనేది ప్రిన్సిపాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఎస్.ఐ. మమత, హెడ్ కానిస్టేబుల్ ఖలీల్, కోటిలింగం వీరమల్లు, అయూబ్, ఆసుపత్రి సిబ్బంది, మరియు రెసిడెన్షియల్ స్కూల్ కం కాలేజ్ కు సంబంధించిన ఉపాధ్యాయులు, సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల చేతిలో 11లక్షలు మోసపోయిన కండక్టర్



జనగామ ఆగస్టు 10 (ప్రజామంటలు):
జనగామ జిల్లాలో సైబర్ నేరగాళ్లు బ్యాంక్ లింక్ పంపి రూ. 11 లక్షలు దోచేశారు. ఖాతాలో రూ. 142 మిగిల్చిన సైబర్ నేరగాళ్లపై బాధితుడు సైబర్ క్రైం లో ఫిర్యాదు చేశారు. ఇక వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటి నిర్మాణానికి మూడేళ్లుగా బ్యాంకులో పొదుపు చేసుకుంటున్న సొమ్మును సైబర్ మాయ గాళ్లు ఏపీకే లింక్ పంపి దాన్ని డౌన్లోడ్ చేయగానే క్షణాల్లో నగదును మాయం చేశారు. ఫోన్ ఔట్ గోయిం గ్ పని చేయడం లేదని.. అనుమానం వచ్చి బ్యాంకు వెళ్లి ఆరా తీయగా ఖాతాలో సొమ్ము లేదని చెప్పడంతో ఖంగుతిన్నాడు సదరు ఖాతాదారుడు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ పట్టణం హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన పోలోజు రామేశ్వర్ ఆర్టీసీ కండక్టర్ గా పని చేస్తున్నాడు. సొంతింటి కళను సాకారం చేసుకునేందుకు మూడేళ్ల క్రితం పునాది వేశాడు. అప్పటి నుంచి ఇంటి నిర్మాణానికి సంపాదనలో కొంత సొమ్మును పొదుపు చేస్తూ స్థానిక యూనియన్ బ్యాంకులో రూ. 11 లక్షల వరకు జమ చేశాడు. ఇంటి నిర్మాణ పనులకు అవసరమైనప్పుడు బ్యాంకు నుంచి కొంత నగదును డ్రా చేసుకుంటున్నాడు. కాగా ఈనెల 8వ తేదీన వ్యక్తిగత పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లిన రామేశ్వర్.. తిరుగు ప్రయాణంలో తన ఫోను యూనియన్ బ్యాంకుకు సంబంధించిన ఏపీకే యాప్ లింక్తో ఫేక్ మెసేజ్ వచ్చింది. బ్యాంకు ఖాతా సేఫ్టీ కోసం యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సైబర్ మోసగాడు పంపించిన యాప్ ను డౌన్లోడ్ చేసుకున్నాడు. సైబర్ నేరస్తుడు సదరు వ్యక్తికి ఎటువంటి అనుమానం కలుగకుండా తన ఫోన్ ఔట్ గోయింగ్ కాల్ వెళ్లకుండా చేశాడు. అదే రోజు రాత్రి రామేశ్వర్ యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి రూ. 7 లక్షలు, శుక్రవారం రూ. 4.21 లక్షలు, మొత్తంగా 16 లావాదేవీల ద్వారా రూ. 11.21 లక్షల నగదును డ్రా చేసుకుని, రూ. 142 మాత్రమే మిగిల్చారు. ఫోన్ కలవడం లేదని అనుమానం వచ్చిన బాధితుడు రిపేరు సెంటర్ కు వెళ్లి సరి చేయగా, డబ్బులు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో అక్కడ నుంచి హుటాహుటిన బ్యాంకుకు వెళ్లారు. బ్యాంకు అ ధికారులు ఖాతా నంబర్ ను పరిశీలించిన తర్వాత పెద్ద మొత్తంలో డబ్బులు డ్రా అయినట్లు తెలిపారు. ఇందులో రూ. 9.21 లక్షల నగదు అనుమానం కలుగకుండా డ్రా చేయగా, రూ. 2 లక్షలు మాత్రం చెన్నైలోని సిద్దపు దూర్ సెంట్రల్ బ్యాంకు నుంచి రాహుల్ అనే వ్యక్తికి నెఫ్ట్ చేసినట్లు గుర్తించినట్లు బాధితుడు రామేశ్వర్ తెలిపారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా 1930కు ఫోన్ చేసి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేయించారు. వెంటనే కేసును విచారించిన పోలీసులు, రూ. 1.37 లక్షలను హోల్డ్ చేసినట్లు మెసేజ్ వచ్చినట్లు రామేశ్వర్ తెలిపారు. పోలీసులు విచారణ చేసి న్యాయం చేయాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు.



## జాతీయ నంది అవార్డు పొందిన గనవేని మల్లేష్ యాదవ్‌సన్మానించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మల్లాపూర్ ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
జాతీయ నంది అవార్డు పొందిన గనవేని మల్లేష్ యాదవ్ ను హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో శనివారం శాలువా సత్కరించి ఘనంగా సన్మానించి అభినందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి బీ.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో సామజిక సేవలు అందించి యువకులకు స్పూర్తి గా నిలుస్తూ,చిన్న వయసులోనే జాతీయ నంది అవార్డు అందుకోవడం హర్షనీయమని అన్నారు. ఇక ముందు కూడా అవసరమైన వారికి సాధ్యమైన సేవలు అందిస్తూ ముందుకు సాగాలని సూచించారు. అభినందనలు శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందించిన కేటీఆర్ కు మల్లేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లాకు రెగ్యులర్ డిఈఓ పోస్ట్ మంజూరు చేయాలి

### సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారానికి చొరవ చూపండి

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను కలిసిన ఎస్టియు నాయకులు



జగిత్యాల ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
జిల్లాకు వెంటనే రెగ్యులర్ జిల్లా విద్యాధికారి (డిఈఓ) పోస్టు మంజూరు చేసి రెగ్యులర్ డి.ఈ.ఓ ను నియమించాలని స్టేట్ టీచర్స్ యూనియన్, ఎస్టియు జగిత్యాల జిల్లా శాఖ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ని శనివారం వారి నివాసంలో ఎస్టియు నాయకులు కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లా ఏర్పడి 8 సంవత్సరాలు గడుస్తున్నా కేవలం విద్యాశాఖకు మాత్రమే రెగ్యులర్ డిఇఓ పోస్ట్ మంజూరు కాక , రెగ్యులర్ డిఇఓ లు లేక అదనపు బాధ్యతలతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వివరించారు. ప్రతీ డివిజన్ కు ఉప విద్యాధికారి (డిప్యూటీ ఈఓ) పోస్ట్ కూడా మంజూరు చేసి పర్యవేక్షణ పెంచాలని కోరారు. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా, డైట్ లెక్చరర్ లు గా, డిఈఓ, డిప్యూటీ ఈవో లుగా, ఎంఈఓ లుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో నిలుపుదల చేసిన ఉపాధ్యాయులకు నెలనెలా పదోన్నతుల జీవో నెంబర్ 67 ను పునరుద్ధరించి వెంటనే అమలు చేయాలని కోరారు. అప్ గ్రేడేషన్ కు ముందు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కారణాల చేత ఖాళీగా ఉన్న 900 ల స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ పోస్టులను అర్హత గల ఎస్.జి.టి, పండితులకు ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఇటీవల బదిలీల ప్రక్రియ సజావుగా పూర్తి చేసినందుకు, పాఠశాలల పరిశుభ్రతకై సర్వీస్ పర్సన్ ల నియామకానికి, పాఠశాలలకు ఉచిత విద్యుత్ కల్పిస్తామని చేసిన సీఎం ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు పుష్పగుచ్చం సమర్పించి శాలువాతో సత్కరించారు.

## జంతు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్పర్సన్

జగిత్యాల ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
జగిత్యాల పట్టణ టిఆర్ నగర్ లో పట్టణ ప్రగతి నిదులు 35 లక్షలతో జంతు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. నరేష్, కమిషనర్ సమ్మయ్య, స్థానిక కౌన్సిలర్ లు దేవేందర్ నాయక్, చాంద్ పాషా, డిఈ యాదగిరి, ఏఓ శ్రీనివాస్, కౌన్సిలర్ లు, వార్డు నాయకులు, మహిళలు, యువకులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# వర్ధన్నపేట ఎమ్మెల్యే పరామర్శ

హనుమకొండ/ వరంగల్ ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
హనుమకొండ జిల్లా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయ్యాల రాంరెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి మరణించగా నేడు వారి నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు. ఎమ్మెల్యే వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్ళపల్లి తిరుపతి, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, పాక్స్ చైర్మన్ ఉదయ్ రెడ్డి, విష్ణు, పోలేపాక అశోక్, ఆడేపు వీరస్వామి, రామంచ ఐలయ్య, యూత్ నాయకులు ఆవుల పవన్ కళ్యాణ్, నందిపాక భాస్కర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లేశం, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వేలేరు ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
వేలేరు మండలం, మల్లికుదుర్ల గ్రామానికి చెందిన కి,,శే,, గంగపురం మహేష్, కీ.శే. లేకుంట్ల భద్రయ్య, కీ.శే. జక్కుల ఐలమ్మ ఇటీవలే అనారోగ్యంతో మరణించగా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణపై విద్యార్థులకు అవేర్నెస్




సికింద్రాబాద్ ఆగస్టు 10 (ప్రజామంటలు):
ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో ఎంటమాలజీ అధికారులు బన్సీలాల్ పేట డివిజన్లోని ఆయా స్కూళ్లకు వెళ్లి విద్యార్థులకు దోమల వలన కలుగు అనర్థాలు నివారణ అంశాలపై అవేర్నెస్ కల్పిస్తున్నారు. ది సాల్వేషన్ ఆర్మీ ఇంగ్లీష్ స్కూల్లో ఫ్రైడే, డ్రై డే అంశంపై విద్యార్థులకు దోమల వ్యాప్తి పై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు ను నిల్వ ఉంచకుండా ప్రతి శుక్రవారం నీటిని క్లియర్ చేయాలని కోరారు. వెంట మాలాజీ సూపర్వైజర్ రాజేందర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# పోస్టల్ అందించే సేవలపై ప్రజలకు అవగాహన

మల్లాపూర్ ఆగస్టు 10 (ప్రజా మంటలు):
మల్లాపూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద తపాలా (పోస్టల్) శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ అందించే సేవలపై శనివారం, పోస్టల్ అధికారులు పోస్ట్ సిబ్బంది డీసీడీపీ (డాక్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్) పోస్ట్ ఆఫీస్ ద్వారా అందించేటువంటి వివిధ పథకాల గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఇందులో 10 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన పథకం, పోస్ట్ ఆఫీస్ సేవింగ్ బ్యాంక్ అకౌంట్, జీవిత బీమా పథకములు అయినా ఆర్ పి ఎల్ ఐ, పి ఎల్ ఐ లు, ఐదు నుండి 15 లక్షల వరకు ప్రమాద బీమా, సీనియర్ సిటిజన్ సేవింగ్స్, ఫిక్స్ డిపాజిట్ అయినటువంటి టైం డిపాజిట్, మరియు చిన్న ముత్తాల పొదుపు అయినటువంటి ఆర్ డి సేవలు గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జగిత్యాల వెస్ట్ సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ సఫీయుద్దీన్, మేల్ ఓవర్సీర్ మహేష్, బ్రాంచ్ పోస్టుమాస్టర్లు రాజేశం, వెంకటరమణ, ఎస్పీ రమణ, గౌతమ్, రామకృష్ణ, సురేష్, శివ లాల్, భూమయ్య, భూమేష్ సుమతి స్వాతి రఘు, శ్రీను, ప్రశాంత్ ముత్యంపేట్ పోస్ట్ ఆఫీస్ సిబ్బంది మహిళలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్,బీజేపీ విలీనం అంతా ట్రాష్

**- భారాస ఔట్‌డేటెడ్ పార్టీ**

**- కేటీఆర్ జైలు కెళ్లడం ఖాయం**

**- ఆ పని రేవంత్ చూసుకుంటారు**

**- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్**



హైదరాబాద్ (ప్రజామంటలు):
మాజీ మంత్రి కేటీఆర్ కు జైలు తప్పదని, ఆయన చేసిన అరాచకాలు, అవినీతి అందరికీ తెలుసునని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ విలీనం వార్తలను ఆయన కొట్టి పారేశారు. బిఆర్ఎస్ పని అయిపోయిందని అన్నారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. కేటీఆర్ ను జైలుకు పంపే పనిని సీఎం రేవంత్ రెడ్డి చూసుకుంటారని చెప్పారు. తనతోపాటు ఎందరో బీజేపీ కార్యకర్తలను నాయకులను కేటీఆర్ జైల్లో వేసి హింసించారని దానిని తానింకా మర్చిపోలేదని అన్నారు. బీఆర్ఎస్ బీజేపీతో చర్చలు జరిపినట్టు వస్తున్నవి ఫేక్ న్యూస్ అని అన్నారు. బీఆర్ఎస్ ఓ ఔట్ డేటెడ్ పార్టీఅని అన్నారు. కవిత బెయిల్ కు బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. సిసోడియాకు బెయిల్ వస్తే బీజేపీకి ఏమైనా సంబంధం ఉందా..? అంటూ ప్రశ్నించారు. కోర్టు అంశాలను పార్టీతో ముడిపెట్టడం సరికాదని చెప్పారు. రాష్ట్రంలో నిజాయితీగా పనిచేసే ఐపీఎస్ లకు ఇప్పటికీ పోస్టింగ్ ఇవ్వకపోవడం విడ్డూరమన్నారు. బిఆర్ఎస్ కొమ్ముకాసిన ఐఏఎస్ లకే మళ్లీ పోస్టింగులు ఇస్తునారని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనకు మధ్య పెద్దగా తేడా ఏమీలేదని, అతి తక్కువ టైంలో ప్రజా వ్యతిరేకత చురగొన్న ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని బండి సంజయ్ అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని చెప్పారు. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ, జడ్పీటీసీలే మా బ్రాండ్ అంబాసిడర్లని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడి కోసమే అమెరికా వెళ్లారనటం సరికాదని బండి అన్నారు. రాజకీయాల్లో విమర్శలు చేసేటప్పుడు హుందాగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఇతర పార్టీలను చీల్చి లాభం పొందాలనే ఆలోచన బీజేపీకి లేదన్నారు. కాంగ్రెస్ కు ప్రజలు ఐదేళ్ల తీర్పు ఇచ్చారని, అధికారాన్ని ఉంచుకుంటారా? వదులుకుంటారా? అనేది వాళ్ల పై ఆధారపడి ఉంటుందని అన్నారు. అసదుద్దీన్ ఓ వైసీ ఎన్ని వక్ఫ్ బోర్డు భూములను కాపాడారో చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. గతంలో వక్ఫ్ బోర్డు భూములను కాంగ్రెస్, ఎంఐఎం నేతలు చా లా చోట్ల కబ్జా చేశారని విమర్శించారు. సవరణ బిల్లు ఆమోదం పొందితే అన్ని విషయాలు బయటికి వస్తాయని విరించారు. వక్ఫ్ బోర్డు భూములకు సంబంధించి ఎంత మంది పేద ముస్లింలకు ఇచ్చారో చెప్పగలరా అని ప్రశ్నించారు. వక్ఫ్ బోర్డు భూములను కాంగ్రెస్, ఎంఐఎం నేతలు చాలా చోట్ల కబ్జా చేశారని.. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందితే... వాస్తవాలన్నీ బయటకు వస్తాయన్నారు. బీజేపీ స్టేట్ చీఫ్ ఎవరనేది జాతీయ అధ్యక్షుడు నడ్డా డిసైడ్ చేస్తారని అన్నారు. అధినాయకత్వం నిర్ణయమే పార్టీకి శిరోధార్యమని చెప్పారు.కాంగ్రెస్‌లో లుకలుకలు మొదలయ్యాయని.. ఇతర పార్టీలను చీల్చి లాభం పొందాలనే ఆలోచన బీజేపీకి లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కు ప్రజలు ఐదేళ్ల తీర్పు ఇచ్చారు.. ఐదేళ్లు అధికారాన్ని ఉంచుకుంటారా? వదులుకుంటారా? అనేది ప్రభుత్వ తీరుపై ఆధారపడి ఉందన్నారు. హైకమాండ్ ఎవర్నిబీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా నియమిస్తే వారి నేతృత్వంలో పని చేస్తామన్నారు.

## బిహార్ అత్యంత విలువైన కాలిఫోర్నియం స్వాధీనం

**- 50 గ్రాముల పదార్థం విలువ రూ.850 - వెల్లడించిన పోలీసులు**

పాట్నా (ప్రజామంటలు):అత్యంత విలువైన రేడియో యాక్టివ్ పదార్థం కాలిఫోర్నియంను బిహార్ లోని గోపాల్ గంజ్ పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. దాదాపు 50 గ్రాముల బరువున్న ఈ పదార్థం విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ.850 కోట్లకు పైమాటే. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ స్వార్న్ ప్రభాత్ ధ్రువీకరించారు. నిందితులు ఈ పదార్థాన్ని అక్రమ రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. మా జిల్లా నుంచి విలువైన రేడియో ధార్మిక పదార్థాన్ని అక్రమ రవాణా చేస్తున్నట్లు ఓ టిప్ వచ్చింది. దీంతో మేం బృందాలు సిద్ధం చేశాం. డిస్ట్రిక్ట్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌ను అప్రమత్తంగా ఉంచాం. స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, ఎస్టీఎఫ్ దళాలను రంగంలోకి దించాం. వీరిని ఉత్తరప్రదేశ్–బిహార్ సరిహద్దుల్లో మోహరించాం. ఈ సమయంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా.. నాలుగు మొబైల్ ఫోన్లతోపాటు 50 గ్రాముల కాలిఫోర్నియం కూడా బయట పడింది. అంతర్జాతీయ మార్కెట్లో దీని ధర గ్రాము రూ.17 కోట్లు అని ఎస్పీ ప్రభాత్ వెల్లడించారు. నిందితులను చోటే లాల్ ప్రసాద్, చందన్ గుప్తాగా గుర్తించారు. వీరు ఈ కాలిఫోర్నియంను విక్రయించేం దుకు కొన్ని నెలలుగా యత్నిస్తున్నట్లు చెప్పారు. దర్యాప్తును ముందుకు తీసుకెళ్లేందుకు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించామన్నారు. కాలిఫోర్నియంను పోర్టబుల్ మెటల్ డిటెక్టర్లలో వినియోగిస్తారు. వీటితో బంగారం, వెండి ఇతర విలువైన లోహాలను గుర్తించవచ్చు. దీంతోపాటు ఇంధన బావుల్లో నీరు, చమురు పొరలు గుర్తించేందుకు వాడతారు. ఇక విమానాల్లో లోహాల అరుగుదలను అంచనావేసేందుకు కూడా వినియోగించవచ్చు.

## బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం

**- సావోపాలో వద్ద కుప్ప కూలిన విమానం - 61 మంది ప్రయాణికుల దుర్మరణం**

న్యూఢిల్లీ (ప్రజామంటలు):
బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. సావోపాలో వద్ద ఓ విమానం అదుపు తప్పి కుప్ప కూలింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న 61 మంది ప్రాణాలు కోల్పోయారు. సోషల్ మీడియాలో ఈ ప్రమాద దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. గాల్లో అదుపు తప్పి చక్కర్లు కొట్టిన విమానం ఒక్కసారిగా కూలిపోయింది. భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. ఘటనా స్థలానికి పక్కనే ఇళ్లున్నాయి. వాటి వెనకాల చెట్ల పొదల్లో కూలిపోయింది. విమానంలో ఉన్న వాళ్లలో ఒక్కరు కూడా ప్రాణాలతో లేరని అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఓ ఇల్లు ధ్వంసమైనట్టు తెలిపారు. స్థానికులకు ఎలాంటి గాయాలు కాలేదని స్పష్టం చేశారు. ఈ ఘటనపై బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాకియో లూలా డా సిల్వా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలుపుతూ ఓ నిముషం మౌనం పాటించాలని పిలుపునిచ్చారు. ఈ ఘటనపై స్పందించింది. కాస్కావెల్ నుంచి టేకాఫ్ అయిన విమానం..విన్హెడో టౌన్‌లో ప్రమాదానికి గురైనట్టు వెల్లడించింది. అయితే...ఈ ప్రమాదానికి కారణమేంటన్నది మాత్రం ఇంకా తెలియలేదని వివరించింది. విచారణ జరుగుతోందని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపింది. ప్రస్తుతానికి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పుతోంది. ప్రమాదానికి ముందు చేసిన ట్రాకింగ్ ప్రకారం విమానం 4,100 అడుగుల ఎత్తులో ఉంది. సావోపాలోకి వచ్చే సమయంలోనే ఇలా కుప్ప కూలిపోయింది. ప్రత్యక్ష సాక్ష్యులు ఈ ప్రమాదాన్ని తలుచుకుని వణికిపోతున్నారు. కొంచెంలో పెను ప్రమాదం తప్పిందని, లేకపోతే విమానం నేరుగా తమ ఇళ్లపై పడిపోయేదని వివరిస్తున్నారు. ఈ శబ్దం వినగానే ఒక్కసారిగా గుండె ఆగిపోయినట్టుగా అనిపించిందని అంటున్నారు. ఈ శబ్దం విన్న వెంటనే చాలా మంది బయటకు పరిగెత్తుకుంటూ వచ్చారు. ఇళ్ల వెనకాలే పొదల్లో విమానం పడిపోవడాన్ని చూసి షాక్ అయ్యారు.

## తెలంగాణలో కొత్త విమనాశ్రయాల ఏర్పాటు

**పరిశీలిస్తామన్న మంత్రి రామ్మోహన్ నాయుడు**

హైదరాబాద్ (ప్రజామంటలు):
తెలంగాణలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటును పరిశీలిస్తామని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. విమానాశ్రయాల భద్రతలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రయాణికులు సైతం విమానాశ్రయాల్లో తనిఖీలు, భద్రత పట్ల అవగాహన కలిగి ఉండి.. భద్రతా సిబ్బందికి సహకరించాలని కోరారు. చంద్రబాబు హయాంలోనే శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బీజం పడిందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. అప్పుడు ఇంత భూమి ఎందుకు కేటాయించారని పలువురు విమర్శలు చేశారన్నారు.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్ నిర్వహించారు. కార్యక్రమంలో రామ్మోహన్ నాయుడు పాల్గొని మొక్కలు నాటారు. తల్లిపేరు మీద మొక్క నాటాలన్న ప్రధాని మోడీ సూచనలతో ప్రతి ఒక్కూ మొక్కలు నాటాలని అన్నారు. అనంతరం మాట్లాడుతూ.. చంద్రబాబు దూరదృష్టితోనే శంషాబాద్ విమానాశ్రయానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు వచ్చిందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కేంద్రమంత్రి సూచించారు.

## గాజాలో పాఠశాలపై ఇజ్రాయెల్ దాడి..

**- 100 మందికి పైగా మృతి!**



గాజాస్ట్రిప్ (ప్రజామంటలు):
హమాస్, హెజ్‌బొల్లాల కీలక నేతల హత్యల నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై ఏ క్షణమైనా దాడులు జరిగే ప్రమాదం పొంచి ఉండటంతో..పశ్చిమాసియాలో పరిస్థితులు తీవ్రంగా మారాయి. ఈ సమయంలో కూడా గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. తాజాగా తూర్పు గాజాలోని ఓ పాఠశాలలో తలదాచుకుంటున్న వారిపై ఇజ్రాయెల్ దాడి చేసింది. అంతర్జాతీయ మీడియా తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గాజాలో నిరాశ్రయులు తలదాచుకుంటున్న ఓ పాఠశాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ దాడులకు పాల్పడింది. ఈ దాడిలో దాదాపు వంద మందికి పైగా ప్రజలు మరణించగా, పలువురు గాయపడినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.గత వారంలో గాజాలోని మూడు పాఠశాలలపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడింది. ఇటీవల ఓ పాఠశాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 30 మంది మరణించగా పలువురు గాయాలపాలయ్యారు. ఆగస్టు 1న దలాల్ అల్–ముఘ్రాబీ స్కూల్‌పై చేసిన దాడుల్లో 15 మంది మరణించారు.అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదుల మెరుపు దాడుల నేపథ్యంలో.. అందుకు ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోన్న విషయం తెలిసిందే. ఈ యుద్ధంలో ఇప్పటివరకు గాజాలో 40,000 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. ఇటీవల జరిగిన హమాస్, హెజ్‌బొల్లాల కీలక నేతల హత్యల నేపథ్యంలో పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. హమాస్‌ను భూస్థాపితం చేస్తామంటూ ఇజ్రాయెల్ గాజాపై బాంబుల వర్షం కురిపిస్తోంది. వాటి ధాటికి అక్కడి భవనాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, తాగునీటి వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. ఈ దాడుల్లో ఇప్పటివరకు దాదాపు 40 వేల మంది పాలస్తీనీయులు మృతి చెందినట్లు స్థానిక ఆరోగ్య శాఖ వెల్లడించింది.

## ఇండియాలో మరో సంచలనం..

**- హిండెన్‌బర్గ్ సంస్థ ఆసక్తికర ట్వీట్ - అందరిలోనూ ఉత్కంఠ**

న్యూఢిల్లీ (ప్రజామంటలు):
అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసర్చ్ సంస్థ ఇవాళ ఓ అర్థంకాని ట్వీట్‌ను పోస్టు చేసింది. ఇండియాలో మరో సంచలనం బయటపడనున్నట్లు ఆ ఎక్స్ పోస్టు ద్వారా హిండెన్‌బర్గ్ సంస్థ వెల్లడించింది. ఇటీవల అదానీ స్టాక్ మార్కెట్‌పై హిండెన్‌బర్గ్ రిలీజ్ చేసిన రిపోర్టుతో ఆ సంస్థ మార్కెట్ విలువ దారుణంగా పడిపోయింది.అయితే ఇవాళ తన ఎక్స్ అకౌంట్‌లో చేసిన పోస్టు.. భారత్ మరో సంచలనాన్ని నమోదు చేస్తుందేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హిండెన్‌బర్గ్ రీసర్చ్ సంస్థ చేసిన పోస్టు ఇప్పటికే అందర్నీ ఆకర్షిస్తున్నది. అదానీ అంశంలో ఆ సంస్థకు సెబీ షోకాజ్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను అదానీ గ్రూపు కొట్టివేసింది. కానీ తమ గ్రూపు కంపెనీలు సుమారు వంద బిలియన్ల డాలర్లు నష్టపోయినట్లు ఆ సంస్థ తెలిపింది.

## నూతన రైల్వేలైన్ దృష్ట్యా

**బయ్యారంలో వెంటనే ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలి**

**- వినోద్ కుమార్**

హైదరాబాద్ (ప్రజామంటలు): భద్రాచలం – మల్కన్‌గిరి రైల్వే లైన్‌కు అనుమతుల దృష్ట్యా వెంటనే బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. రైల్వే లైన్ లేకపోవడం వల్లనే బయ్యారానికి ఉక్కు కర్మాగారం రావడం లేదని, ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్లా విశాఖ కన్నా బయ్యారంకే దగ్గర అని పేర్కొన్నారు.బయ్యారంలో 300 మిలియన్ టన్నుల ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని గతంలోనే సెయిల్ ప్రాతిపాదించిందన్న ఆయన అక్కడ ఫ్యాక్టరీ వస్తే 4000 మందికి ప్రత్యక్షంగా, పదివేల మందికి పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని వివరించారు. బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తేనే ఈ రైల్వే లైన్ తెలంగాణకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కొత్త రైల్వే లైన్ ఖనిజ సంపదను గుజరాత్ తరలించేందుకు ఉపయోగపడేలా మారకూడదని వినోద్ కుమార్ వ్యాఖ్యానించారు.విభజన హామీల సాధనకు కృషిచేయాలి : 2030 నాటికి తలసరి ఉక్కు వినియోగాన్ని భారీగా పెంచాలని కేంద్రం 2017లో విధానం తీసుకొచ్చిందని, బయ్యారంలో ఉక్కు కర్మాగారం పెడితేనే ఈ తలసరి వినియోగం పెరుగుతుందని అన్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణలో భారీ పరిశ్రమలకు పది పైసలైనా ఇచ్చిందా? అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ నుంచి గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు విభజన హామీలు నెరవేర్చేందుకు కృషి చేయాలని వినోద్ కుమార్ కోరారు.భద్రాద్రి మీదుగా కొత్త రైలు మార్గం : ఎనిమిది కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్రమంత్రి వర్గం శుక్రవారమే ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఝార్ఖండ్, బిహార్, బంగాల్‌లో వీటిని చేపట్టనున్నారు. అందులో భాగంగానే ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా పాండురంగాపురం వరకు రూ.4,109 కోట్లతో 200.60కి.మీ పొడవైన కొత్తలైన్ నిర్మాణం జరగనుంది. ఇది సాకారమైతే ఏపీ, తెలంగాణల నుంచి తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు అనుసంధానం పెరుగుతుంది.

## జర్నలిస్ట్ యోగి అంతిమయాత్ర

**పాల్గొన్న వరంగల్ ఎంపీ**

**డా. కడియం కావ్య దంపతులు**



జనగామ ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
జర్నలిస్ట్ యోగి తన కూతురు ఆధ్య మృతిచెందగా విషయం తెలుసుకున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య జనగామలోని వారి నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం జర్నలిస్ట్ యోగి అంతిమ యాత్రలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య డా. నజీర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ తాను ఎంచుకున్న జర్నలిజం మార్గంలో అవిశ్రాంతంగా కృషి చేశారని, యోగి జీవితం ఇలా అర్థాంతరంగా ముగియడం బాధాకరమన్నారు.

## అనాథ వృద్ధురాలును చేరదీసిన 'సహృదయ'



ఎల్కతుర్తి ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండలంలోని పెంచికల్ పేట గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కనగల బస్టాండులో నివాసముంటున్న అనాథ వృద్ధురాలును హనుమకొండలోని సహృదయ అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకులు చేరదీశారు. గుర్తుతెలియని వృద్ధురాలు గత కొన్ని రోజులుగా బస్టాండ్ లోనే నివాసం ఉంటూ స్థానికులు ఇచ్చిన ఆహారాన్ని తింటూ జీవిస్తుంది. ఆమె దౌర్భాగ్య పరిస్థితిని గమనించిన స్థానికులు సహృదయ వృద్ధాశ్రమం నిర్వాహకులకు సమాచారం అందించారు. దీనికి వెంటనే స్పందించిన వృద్ధాశ్రమ నిర్వాహకురాలు యాకుబి శనివారం అక్కడికి చేరుకొని వృద్ధురాలికి ఆహారం తినిపించారు. వృద్ధురాలి వివరాలు ఆరా తీయగా ఆమె నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. అనంతరం ఆమెను తమ వృద్ధాశ్రమానికి తీసుకెళ్లారు. ఇకపై వృద్ధురాలు యోగక్షమాలన్నీ మేమే చూసుకుంటామని ఈ సందర్భంగా నిర్వాహకురాలు యాకూబి చెప్పారు. కాగా వృద్ధురాలిని చేరదీసిన సహృదయ వృద్ధాశ్రమ నిర్వాహకులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న పొన్నం యువసేన

**కాంగ్రెస్ నేత తంగళ్ళపల్లి రమేష్**





ఎల్కతుర్తి ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
ప్రతి ఒక్క వ్యక్తికి ఆపదలో అండగా నిలుస్తాను తంగేళ్లపల్లి రమేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్కతుర్తి మండలం లోని గోపాల్పూర్ గ్రామంలో ఇటీవల కాలంలో అనారోగ్య కారణాలవల్ల కాందారపు శేఖరయ్య భార్య సౌందర్య మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేసి ఆర్థిక సహాయం కింద 50 కిలోల బియ్యం ఆర్థిక సాయం అందజేసిన పొన్నం యువసేన తంగళ్ళపల్లి రమేష్. నిరుపేద కుటుంబాలకు ఎల్లవేళలా తోడు నీడగా ఉంటానని రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ విలేజ్ ప్రెసిడెంట్ తాళ్ల తిరుపతి, కిసాన్ సెల్ అధ్యక్షులు పెండ్యాల తిరుపతి, సిపిఐ నాయకులు మనోహర్, శ్రీపతి మణికిరణ్, మారుపాక సందీప్, మామునూరు కళ్యాణ్, జనగాని ప్రణీత్, సంపత్, శ్రీనివాస్, హరీష్, కుమారస్వామి, అఖిల్, మనోజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధం, రెండు లక్షల మేర నష్టం

**నష్టపరిహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరిన బోయపోతు కిష్టయ్య**



గొల్లపల్లి ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
గొల్లపెల్లి మండల కేంద్రానికి చెందిన బొయపోతు కిష్టయ్య పశువుల కోసం తన ఇంటివద్ద నిల్వ ఉంచిన పశు గ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధం అవ్వగా కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం శు క్రవారం అర్ధరాత్రి గడ్డి కాలుతు పొగ రావటంతో గమనించిన కిష్టయ్య చుట్టు పక్కల వారి సహాయంతో బోరు మోటార్ల నీటితో చల్లార్చారు. పెద్ద ప్రమాదం తప్పిందని చుట్టు పక్కల వారు తెలిపారు. పశుగ్రాసం నిల్వ ఉంచిన శెడ్డు సైతం మంటల్లో కాలిపొయింది. సుమారు రెండు లక్షల మేర నష్టం జరిగిందని ప్రభుత్వం అదుకోవాలని కోరారు.

## టిప్పర్ లారీ ఢీకొని ఇద్దరు మృతి





వేలేరు ఆగస్ట్ 10 (ప్రజామంటలు):
ఈ రోజు ఆగస్ట్ 10న మల్లీకుదుర్ల గ్రామానికి చెందిన గురజాల మల్లారెడ్డి (తండ్రి: నరసింహారెడ్డి వయస్సు 60 సం.) మరియు అతని బావమరిది అదే గ్రామానికి చెందిన సారం పెల్లి అమరేందర్ రెడ్డి (తండ్రి: షణ్ముఖ రెడ్డి వయస్సు 40 సం.) ఇరువురు కలిసి సారంపల్లి అమరేందర్ రెడ్డి యొక్క ద్విచక్ర వాహనంపై ధర్మసాగర్ వైపు వెళ్తుండగా జానకపురం గ్రామ వద్దగల ఎస్సీ కాలనీ వద్దకి సమయం మధ్యాహ్నం 3 గంటల వరకు వచ్చేసరికి ఎదురుగా టి.ఎస్. 15 యుసి 9459 నెంబర్ గల టిప్పర్ డ్రైవర్ అట్టి వాహనాన్ని అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి అమరేందర్ రెడ్డి ద్విచక్ర వాహనానికి ఢీకొట్టగా అమరేందర్ రెడ్డి మరియు మల్లారెడ్డి ఇద్దరు అక్కడికక్కడే మరణించినారు. ఇట్టి విషయంపై మల్లారెడ్డి కుమారుడు గురజాల రామారెడ్డి దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ధర్మసాగర్ సిఐ ప్రవీణ్ తెలిపారు.